
పెనుమాకలో పింఛన్‌దారు పాముల నాయక్‌కు ఇళ్ల పట్టా అందజేస్తున్న సీఎం చంద్రబాబు


గుంటూరు తూర్పు నియోజకవర్గంలో వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, కమిషనర్ కీర్తి


గుంటూరు పశ్చిమలో ఎమ్మెల్యే గళ్లా మాధవి...


తెనాలి: కవెవరంలో మంత్రి నాదెండ్ల మనోహర్..


పొన్నూరు: పెదకాకానిలో ఎమ్మెల్యే నరేంద్ర కుమార్...


ప్రత్తిపాడు: కొర్నెపాడులో ఎమ్మెల్యే రామాంజనేయులు..


తుళ్ళూరులో ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్...

గుంటూరు జిల్లాలో 95.17 శాతం పంపిణీ

విభజిత గుంటూరు జిల్లాలో మొత్తం 2,58,786 మంది పించనుదారులు వుండగా వారిలో 95.17 శాతం మందికి, అంటే 2,34,367 మందికి సాయంత్రం 6 గంటలలోపు పింఛను పంపిణీ చేశారు. వారికి 173.29 కోట్ల రూపాయలకు గానూ 165.15 కోట్ల రూపాయలు పంపిణీ చేశారు.

వలంటీర్లు.. లేకున్నా..

- సచివాలయ సిబ్బందితోనే పూర్తి స్థాయిలో పింఛన్ల పంపిణీ
- సాయంత్రం గం.6 గంటలకల్లా 90 శాతం పంపిణీ పూర్తి
- సర్వర్ సమస్య తలెత్తినా వేగం తగ్గకుండా ముందుకు
- తొలిరోజే 469 కోట్ల రూపాయల అందజేత
- చేసి చూపించిన కూటమి ప్రభుత్వం

గుంటూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం తొలిరోజు అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంది. జిల్లాలోని ప్రతి ఒక్క పింఛనుదారుకు తొలిరోజే పెంచిన పింఛన్లు అందజేయాలన్న టార్గెట్‌ను ప్రభుత్వం దాదాపుగా పూర్తి చేసింది. సోమవారం మధ్యాహ్నం సర్వర్ సమస్య తలెత్తినప్పటికీ పింఛన్ల పంపిణీలో జాప్యం జరగకుండా సచివాలయ సిబ్బంది జాగ్రత్త పడ్డారు. అనుకున్న విధంగా సాయంత్రం ఆరు గంటలకల్లా బాపట్ల గుంటూరు, పల్నాడు జిల్లాల్లో 90 శాతం మందికి పింఛన్లు అందజేసి తమ సత్తా ఏంటో సచివాలయ ఉద్యోగులు చూపించారు.

● గత ప్రభుత్వ నిర్వాకంతో 33 మంది బలి

ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తరువాత వలంటీర్లతో పింఛన్లు పంపిణీ చేయరాదని ఎన్నికల కమిషన్ ఆదేశిస్తే, ఆ నెపం ప్రతిపక్షాలపై నెట్టేందుకు గత ప్రభుత్వం కుట్రలు చేసింది. సచివాలయ సిబ్బందితో ఎలాంటి ఇబ్బంది లేకుండా పింఛన్లు పంపిణీ చేయవచ్చని ప్రతిపక్ష టీడీపీ, జనసేన, బీజేపీలు ఎంత మొత్తుకున్నా లబ్ధిదారులను సచివాలయాలకు రప్పించి ఎండలో నిలబెట్టారు. బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. ఫలితంగా ఏప్రిల్ నెలలో 33మంది వృద్ధులు అన్యాయంగా చనిపోయారు. ఆ నేరాన్ని ప్రతిపక్షాలకు ఆపాదించాలని అప్పటి వైసీపీ ప్రభుత్వం ఎన్నో ప్రయత్నాలు చేసింది. కానీ ప్రజలు వాటిని నమ్మలేదు. కూటమి ప్రభుత్వానికే పట్టం కట్టారు. తాము అధికారం లోకి వచ్చాక వలంటీర్ల సహాయం లేకపోయినా పింఛన్లు పంపిణీ చేయొచ్చని కూటమి ప్రభుత్వం చెప్పడమే కాకుండా, చేసి చూపించింది. తొలి రోజు సాయంత్రం 6 గంటలకల్లా రాష్ట్రంలోని 92శాతం మంది లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేశారు.

● బాపట్ల జిల్లాలో 94.75 శాతం పూర్తి


ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో బాపట్ల జిల్లా పింఛన్ల పంపిణీలో ముందడుగులో ఉంది. ఆ జిల్లాలో 2,33,102మంది లబ్ధి దారులు వుండగా వారిలో 1,13,547మందికి, అంటే 94.75శాతం మందికి తొలిరోజే ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేశారు. లబ్ధిదారులకు ఇవ్వాల్సిన నగదు రూ.157.11కోట్లకుగానూ, 148.92కోట్లు అందజేశారు.

● పల్నాడు జిల్లాలో 93.36 శాతం పంపిణీ

పల్నాడు జిల్లా పింఛన్ల పంపిణీలో ఒకడుగు వెనుకవుంది. సంఖ్యాపరంగా లబ్ధిదారులు ఎక్కువగా ఉండడం, మారుమూల లోతట్టు ప్రాంతాలు ఉండడంతో పింఛను పంపిణీలో కొంత జాప్యం జరిగింది. ఆ జిల్లాలో 2,79,975మందికిగానూ 2,45,847 మందికి పింఛను అందజేశారు. రూ.190.09కోట్లకుగానూ రూ. 178.71కోట్లు లబ్ధిదారులకు అందజేశారు. మొత్తంగా 3 జిల్లాల్లో రూ.492.76కోట్లు తొలిరోజు అందజేశారు.

- అధికారంలోకి వచ్చిన 26 రోజుల్లో హామీ అమలు
- పింఛన్లు తీసుకువచ్చింది అన్న ఎన్టీఆర్
- పెంచిన పింఛన్లలో నా వాటానే ఎక్కువ
- రూ.4 వేలల్లో నా వాటా పెంపు అక్షరాలా రూ. 2,840
- వలంటీర్లు వద్దన్నారని 33 మందిని బలి తీసుకున్న గత ప్రభుత్వం
- సచివాలయ సిబ్బందితోనే పంపిణీ చేయగలమని నిరూపిస్తాం
- మేం మీకు సేవకులమే.. పెత్తందారులం కాదు
- ఒక్క జిల్లాలో రూ. 111 కోట్లు పింఛను ఇచ్చిన ఘనత ఎన్డీఏదే!
- రాష్ట్రంలో ప్రతి 9 మందిలో ఒకరికి పింఛను
- పంపిణీ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు

పేదింట.. పింఛన్ పండుగ


పాములు నాయక్ ఇంట్లో టీ తాగుతున్న సీఎం చంద్రబాబు

పెనుమాకలో పంపిణీ ప్రారంభించిన సీఎం చంద్రబాబు


గుంటూరు, మంగళగిరి, తాడేపల్లి టౌన్, జూలై 1(ఆంధ్రజ్యోతి): 'పెన్షన్ పండుగకు నేనొచ్చా. అధికారంలోకి వచ్చిన 26 రోజుల్లో ఇచ్చిన హామీ ప్రకారం పింఛను పెంచి మీకు అందించడానికి వచ్చా. అదే ప్రజా సంక్షేమం పట్ల టీడీపీ, ఎన్డీయేకు వున్న చిత్తశుద్ధి. రాష్ట్రవ్యాప్తంగా 65 లక్షల మందికి ఒక్క నెలలో రూ.4,408 కోట్లు పింఛన్ల ద్వారా అందిస్తున్నాం. అదే ఏడాదికైతే రూ.33,100 కోట్లు, ఐదేళ్లకు రూ.లక్షా 65వేల 500కోట్లు పేదలకు ఎన్డీయే ప్రభుత్వం, తెలుగుదేశం పార్టీ అందించబోతోంది. రాష్ట్రంలో ప్రతి 9 మందిలో ఒకరికి పింఛన్లు అందిస్తున్నా. నాకు ఇంత కంటే ఆనందమైన రోజు ఇంకొకటి లేదు. ఇలాంటి మంచి కార్యక్రమాన్ని అందజేయడం భగవంతుడు నాకిచ్చిన అవకాశంగా భావిస్తున్నా' అంటూ ముఖ్యమంత్రి ఉద్వేగానికి గురయ్యారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం ఆయన మంగళగిరి నియోజకవర్గం పెనుమాక గ్రామంలో లాంఛనంగా ప్రారంభించారు. పెనుమాక గ్రామంలో అత్యంత పేదరికంలో మగ్గిపోతున్న గిరిజన కుటుంబం వద్దకు వెళ్లి సోమవారం ఉదయం ఆరున్నర గంటలకల్లా ఇంటి పెద్ద బనావత్ పాములు నాయక్‌కు వృద్ధాప్య పింఛను, ఆయన భార్య సీతకు సీఆర్డీఏ పింఛను, వితంతువైన ఆయన కూతురు సాయికి వితంతు పింఛను ఆయన చేతుల మీదుగా అందించారు. వారి కుటుంబ పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఇల్లులేని వారికి ఇల్లు కట్టించి ఇచ్చే బాధ్యతను తీసుకున్నారు. ఏడాదిలోపు ఇల్లు కట్టించి ఇస్తానని వారికి హామీ ఇచ్చి, బాధ్యతను కలెక్టర్ నాగలక్ష్మికి అప్పగించారు. అనంతరం అక్కడే వారు ఇచ్చిన టీ తాగారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. 'మీ అందరి దయ, ఆశీస్సులతో నాలుగోసారి ముఖ్యమంత్రిగా ఎన్నికై మొట్టమొదటి కార్యక్రమాన్ని మంగళగిరి నియోజకవర్గంలో చేపట్టా. రాష్ట్రంలోనే మూడో అత్యధిక మెజారిటీతో గెలిపించిన నియోజకవర్గంలో మిమ్మల్ని గౌరవించడానికి, మీకు సేవ చేయడానికే పెనుమాకలో ఈ కార్యక్రమం తీసుకున్నా. మంగళగిరిలాంటి నియోజకవర్గంలో 92 వేల మెజారిటీ రావడమంటే మామూలు విషయం కాదు. అందుకు కారణం ఐదేళ్ల పీడకల! రాష్ట్రాన్ని పట్టి పీడించిన వైసీపీ, కనీసం ఇలా కూర్చుని ప్రశాంతంగా మాట్లాడుకునే పరిస్థితి లేదు. ప్రశాంతంగా పడుకునే పరిస్థితి లేదు. పోలీసులు గోడ దూకి నా ఇంటికి కూడా వచ్చే పరిస్థితి నెలకొంది. అలాంటి భయంకర వాతావరణంలో ఐదేళ్లు బతికాం. ఇప్పుడు అంతా మారిపోయింది. ప్రజా ప్రభుత్వం వచ్చింది. ప్రజల కోసం మేమంతా కష్టపడతాం. సంపద సృష్టిస్తాం. ఆ సంపదను పేదలకు అందజేస్తాం. పేదరికం లేని సమాజాన్ని సృష్టించి మా నిజాయితీని నిరూపించుకుంటాం' అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు భరోసా ఇచ్చారు. తాను ఎప్పుడూ సేవకుడినేనని, తమ ప్రభుత్వంలో అందరూ ప్రజలకు సేవే చేస్తారని, తామెవ్వరూ పెత్తందారులం కాదని, మీవద్దకు వచ్చి రచ్చబండ మీద కూర్చుని మీలో ఒకరిగా మీ సమస్యలు విని పరిష్కరించేందుకు కృషిచేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఇందులో ఏ ఒక్కరికీ మినహాయింపు లేదని మంత్రులైన నారా లోకేశ్, శ్రీనివాసరావులను హెచ్చరించారు.

● పింఛను పెంపులో మూడొంతులు నా వాటానే!

మొట్ట మొదటగా పింఛన్లు ఇచ్చింది అన్న ఎన్టీఆర్. ఆ రోజుల్లోనే ఆయన రూ.35 పింఛను ఇచ్చారు. 94-95లో దాన్ని నేను 75 రూపాయలకు పెంచాను. ఆ తరువాత 2014 నాటికి ఆ 75 రూపాయలు 200 రూపాయలకు పెంచారు. 2014లో నేను అధికారంలోకి వస్తూనే రూ. 200 పింఛనును రూ. 1000కి పెంచాను. ఆ తరువాత మళ్లీ దాన్ని రూ. 2వేలకు పెంచాను. ఇప్పుడు రూ. 3 వేల పింఛనును 4వేలకు పెంచాను. మొత్తంగా రూ. 4000 పింఛనులో తాను పెంచిన వాటా 2,840 రూపాయలు. పింఛన్ల పెంపు ద్వారా పేదలను ఆదుకోవడంలో తామెప్పుడూ ముందుంటామని చంద్రబాబు చెప్పారు. దివ్యాంగులకు రూ. 6వేలు, తలసీమియా, కిడ్నీ, లివర్, గుండె మార్పిడి బాధితులకు రూ. 10వేలు, సీరియస్ డయాలసిస్, మంచంపట్టినవారికి రూ. 15వేలు పింఛను ఇస్తున్నామన్నారు.

అత్యాచారం చేస్తే అదే ఆఖరిరోజు..

సభికులతో చర్చ నేపథ్యంలో చంద్రబాబు మహిళలకు ధైర్యం కల్పించారు. బాపట్ల జిల్లా ఈపూరుపాలెంలో జరిగిన అత్యాచార ఘటన ప్రస్తావనకు వచ్చిన సందర్భంగా ఆయన మదాంధకారులకు తీవ్ర హెచ్చరికలు చేశారు. 'రాష్ట్రంలో అందరికీ హెచ్చరిక చేస్తున్నా.. ఎవరైనా సరే ఆడబిడ్డల జోలికి వచ్చి మదాంధకారంతో విచ్చలవిడిగా ప్రవర్తిస్తే వదిలిపెట్టను. ఎవరైనా అత్యాచారం చేస్తే అదే వాళ్లకు ఆఖరి రోజు అవుతుందని హెచ్చరిస్తున్నా. ప్రభుత్వంతో తమాషాలు ఆడొద్దు. యాంటి సోషల్ ఎలిమెంట్ ఎవరైనా సరే నిర్మొహమాటంగా అణచివేస్తా. మర్యాదగా ఇప్పటివరకూ చెప్పా. ఎవరైనా కైపెక్కి, లేదా గంజాయి తాగేసి, మద్యం తాగేసి ఇష్టానుసారం చేస్తే తీవ్ర పరిణామాలు వుంటాయి. నాకు అన్యాయం జరిగిందని ఒక ఆడబిడ్డ నా దగ్గరకు వచ్చిందంటే ఎవ్వరినీ వదిలిపెట్టను. అది స్వయంగా మీరే చూస్తారు. మహిళల్లో ధైర్యం కల్పించడం కోసమే దళిత మహిళ అయిన వంగలపూడి అనితను హోమ్ మంత్రిగా చేశానని చెప్పారు.



మంగళగిరి వేదిక కావడం సంతోషం : లోకేశ్

రాష్ట్ర ప్రభుత్వ తొలి కార్యక్రమానికి మంగళగిరి వేదిక కావడం ఆనందంగా ఉందని మంగళగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ ఆనందం వ్యక్తం చేశారు. పెనుమాకలో జరిగిన ఎన్టీఆర్ భరోసా పింఛను పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 1985 తర్వాత మంగళగిరిలో టీడీపీ గెలవలేదని, 2019లో 5,300 ఓట్ల తేడాతో నేను ఓడిపోయానని, ఐదు సంవత్సరాల్లో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు చేరువయ్యానని ఆయన అన్నారు. పోయినసారి తగ్గిన ఓట్ల సంఖ్యకు పక్కన మరో సున్నా చేర్చి 53,000 ఓట్ల మెజారిటీ ఇస్తారని ఎన్నికలకు ముందే తాను చెప్పానన్నారు. కానీ తాను ఊహించినదానికన్నా 91 వేల ఓట్ల మెజారిటీతో ప్రజలు తనను దీవించారన్నారు. నియోజకవర్గంలో చాలా సమస్యలు వున్నాయి. రోడ్లు, డ్రెయినేజీల సమస్యలు ఉన్నాయని, మూడు నాలుగు దశాబ్దాలుగా కొండపోరంబోకులో ఇళ్లు కట్టుకుని నివాసం వుంటున్న ప్రజలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాల్సి వుందని చెప్పారు. అందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారం కావాలని సీఎంను లోకేశ్ కోరారు. ఎన్డీఏ ప్రభుత్వం తీసుకున్న ఎన్టీఆర్ భరోసా కార్యక్రమం తన నియోజకవర్గం మంగళగిరిలో తీసుకోవడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. తామంతా చంద్రబాబు వెంటే వుంటామని, అమరావతి నిర్మాణం, సీడ్ యాక్సిస్ రోడ్డు అభివృద్ధిలో తామంతా బాబు తోడుంటామని చెప్పారు. అమరావతి నిర్మాణంలో భాగస్వాములవుతామని నియోజకవర్గ ప్రజల తరుపున ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర సెర్ప్ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి, తాడికొండ మాజీ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి, జనసేన నేత చిల్లపల్లి శ్రీనివాసరావు, టీడీపీ నేతలు తమ్మిశెట్టి జానకీదేవి, నందం అబద్దయ్య తదితరులు పాల్గొన్నారు.



పెనుమాకలో ప్రసంగిస్తున్న సీఎం చంద్రబాబు, హాజరైన ప్రజలు


● పెనుమాకలో లబ్ధిదారునికి పింఛన్ అందజేసి ఇంటి నుంచి బయటికి వస్తున్న సీఎం చంద్రబాబు


పింఛన్ అందుకుని ఆనందం వ్యక్తం చేస్తున్న మహిళలు


పింఛన్ అందుకున్న ఆనందంలో వృద్ధురాలు

ఉదయం నుంచే పండగలాగా....

గుంటూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లాలో సచివాలయ ఉద్యోగులతో కలిసి టీడీపీ నేతలు ఉదయంనుంచే పింఛన్ పంపిణీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. పేదల ఆనందమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని, గత ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీని నెరవేర్చాలని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి సోమవారం తెలిపారు. కమిషనర్ కీర్తి చేకూరు తో కలిసి నగరపాలక సంస్థ పరిధిలోని పెన్షనర్లకు ఉదయం 6 గంటల నుండే వారి ఇంటి వద్దనే ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ చేశారు.

- కవెవరం, తెనాలి పట్టణంలోని 7వ,18వ వార్డులలో మంత్రి మనోహర్ పర్యటించి లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ వృద్ధాప్యంలో ఉన్న అవ్వతాతలకు, ఒంటరి మహిళలకు, దివ్యాంగులకు, అనారోగ్యసమస్యలతో మంచంపట్టిన వారికి ప్రభుత్వం భరోసాగా నిలవాలని పింఛన్లను పెంచి అందించడం జరిగిందన్నారు.
- పొన్నూరు పట్టణంలోని 8వ వార్డు, క్యాబిన్‌పేట, షరాఫ్ బజార్‌లోని చాందిని చౌక్ సెంటర్‌లో, మండల పరిధిలోని వెల్లలూరు గ్రామంలో పెన్షన్ల పంపిణి కార్యక్రమం ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభమైంది. అలాగే పలు ప్రాంతాల్లో ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ నేరుగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పెంచిన పెన్షన్ల నగదును లబ్ధిదారులకు అందించారు.
- ప్రజా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని తూర్పు ఎంఎల్‌ఏ మహ్మద్ నసీర్ అన్నారు. సోమవారం తూర్పు నియోజకవర్గం ఆనందపేటలో ఆయన కమిషనర్ కీర్తి చేకూరితో కలిసి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ చేశారు.
- ప్రత్తిపాడు నియోజకవర్గంలో పెంచిన నాలుగు వేల ఫించనుతో పాటు మూడు నెలలకు అదనంగా వెయ్యి రూపాయల చొప్పున ఏడు వేల రూపాయలను వృద్ధులకు, వికలాంగులకు ఆరు వేల రూపాయల చొప్పున ఫించను పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే రామాంజనేయులు ప్రారంభించారు.
- తాడికొండ నియోజకవర్గంలో ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ ఫించన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. తాడికొండలోని ఎన్టీఆర్ విగ్రహాని పూలమాలలు వేసి నివాళులర్పించారు.


తెనాలిలో పింఛన్ అందుకున్న వృద్ధురాలు

3,4 తేదీల్లో నగరంలో నీటి సరఫరాకు అంతరాయం

● కమిషనర్ కీర్తి చేకూరి

గుంటూరు(కార్పొరేషన్), జులై 1: గుంటూరు నగరంలో ఈనెల 3,4 తేదీల్లో (బుధ, గురువారాలు) తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. నగరంలో మెరుగైన తాగునీటి సరఫరా జరిగేలా, ఎక్కడా తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నామని, మెయిన్ పంపింగ్ లైన్ల మీద గుర్తించిన లీకులకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయడం జరుగుతుందని కమిషనర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సంగం జాగర్లమూడి హెడ్ వాటర్ వర్క్స్ నుండి గుంటూరు నగరానికి తాగునీరు సరఫరా చేసే 685 ఎం.ఎం. డయా సీఐ పంపింగ్ మెయిన్ లైన్‌పై ఫిల్టరేషన్ ప్లాంట్ వద్ద ఏర్పడిన లీకు వలన తాగునీరు వృథా అవుతోందని, లీకు మరమ్మతులను వెంటనే చేపట్టాల్సి ఉందన్నారు. లీకు మరమ్మతుల కోసం సంగం జాగర్లమూడి ఫిల్టరేషన్ ప్లాంట్ పూర్తి గా నిలుపుదల చేయాలని, ఈ నెల 3వ తేదీ ఉదయం సరఫరా తదుపరి పనులు చేపట్టడానికి ఇంజినీరింగ్ అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారని తెలిపారు. పైప్‌లైన్ మరమ్మతుల వలన బుధవారం సాయంత్రం, గురువారం ఉదయం వరకు నగరంలోని నాజ్‌సెంటర్ రిజర్వాయర్ పరిధిలోని 5, 7 డివిజన్లలోని నాజ్ సెంటర్, గుంటూరువారితోట, పొత్తూరువారి తోట, గణేష్‌రావు పేట, కొత్తపేట, రాజాగారితోట, రామిరెడ్డితోట 1 నుండి 8 లైన్లు, గంటలమ్మ చెట్టు, చౌత్రా సెంటర్, పూల మార్కెట్, ఎల్బీనగర్, బాలాజీనగర్ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా నిలిపివేస్తామన్నారు. గురువారం సాయంత్రం నుండి తాగునీటి సరఫరా యథావిధిగా జరుగుతుందన్నారు. నగర ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకొని సహకరించాలని కోరారు.

వ్యవసాయ శాఖకు... పెమ్మసాని షాక్

- అర్బన్ ఏఓలుగా పాతవారినే కొనసాగిస్తూ తొలుత ఉత్తర్వులు
- కేంద్ర మంత్రి సమీక్ష తర్వాత సీన్ రివర్స్
- అర్ధరాత్రి ఉత్తర్వులు రద్దు చేసిన కమిషనర్

గుంటూరు సిటీ, జూలై 1: అచేతనంగా ఉన్న గుంటూరు జిల్లా వ్యవసాయశాఖకు కేంద్రమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ షాక్ బాగా తగిలింది. ప్రభుత్వం మారిన తర్వాత కూడా తీరు మార్చుకోని అధికారులకు కేంద్రమంత్రి హెచ్చరికలు ముచ్చెమటలు పట్టించాయి.పెమ్మసాని సమీక్ష తర్వాత హడావుడిగా జరిగిన మార్పులు ఈ మాటలను బలపరుస్తున్నాయి. గుంటూరు అర్బన్ పరిధిలో ఇద్దరు ఏఓ(అగ్రికల్చర్ ఆఫీసర్)లు డిప్యూటేషన్‌పై పనిచేస్తున్నారు. వారిలో ఒకరు వైసీపీ ప్రజాప్రతినిధుల సిఫార్సుతో అక్కడకు వచ్చారన్న ఆరోపణలు ఉన్నాయి. జూన్ 30కి ఇద్దరు ఏఓల డిప్యూటేషన్ గడువు ముగిసింది. ఆదివారం కలెక్టరేట్‌లో కేంద్ర మంత్రి చంద్రశేఖర్ సమీక్ష జరుగుతుండగానే మళ్లీ పాతవారినే అర్బన్ ఏఓలుగా కొనసాగిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. సమీక్షలో వ్యవసాయశాఖపై కేంద్రమంత్రి ఆగ్రహోదగ్రులు కావటంతో సాయంత్రానికి సీన్ రివర్స్ అయ్యింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో అర్బన్ ఏఓలుగా కొనసాగిస్తూ ఇచ్చిన ఉత్తర్వులు ఆగమేఘాల మీద రద్దయ్యాయి. ఆ ఇద్దరినీ పక్కనపెట్టి మరో ఇద్దరిని తీసుకోవాలని కమిషనరేట్ అధికారులు సూచించారు. మొదటిచ్చిన ఉత్తర్వులు రద్దుచేయటం వ్యవసాయ శాఖలో సంచలనంగా మారింది.

అర్బన్ ఏఓ పోస్టు భలే హాట్..

గుంటూరు అర్బన్ ఏఓ పోస్టుకు బాగా గిరాకీ ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. సుమారు 500కు పైగా విత్తనాలు, పురుగుమందులు, ఎరువుల కంపెనీలు, షాపులు నగర పరిధిలో ఉన్నాయి. వీటి లైసెన్స్ వ్యవహారమంతా అర్బన్ ఏఓల కనుసన్నల్లోనే జరుగుతుంది. ఒక్కో లైసెన్స్ ఇవ్వటానికి, రెన్యువల్‌కు రూ.50వేలకు తగ్గకుండా తీసుకుంటారన్న ప్రచారం ఉంది. అదీకాక విత్తనాలు, పురుగుమందుల శాంపిల్‌సేకరణ కూడా ఇక్కడ పెద్ద ఆదాయవనరుగా మారింది. దీంతో ఈ పోస్టుకోసం చాలామంది ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పుడు కూడా మొత్తం ఐదుగురు పేర్లతో జిల్లా అధికారి జాబితా కమిషనరేట్‌కు పంపారు. ప్రస్తుతం అర్బన్‌లో ఉన్న ఏఓలకు వ్యతిరేకంగా వాట్సాప్‌లో పలు మెసేజ్‌లు వైరలయ్యాయి. ఇంతలో కేంద్రమంత్రి పెమ్మసాని సమీక్షతో మొత్తం వ్యవహారం పూర్తిగా మారిపోయింది.



టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో

విచారణ ప్రారంభం

- రెండు రోజులుగా వివరాలుసేకరిస్తున్న పోలీస్ బృందం
- సీసీ కెమెరా ఫుటేజీల పరిశీలన
- బాధితులను, ప్రత్యక్ష సాక్షులను విచారిస్తున్న పోలీసు అధికారులు
- అజ్ఞాతంలో ప్రధాన నిందితుడు సహా పలువురు కీలక వ్యక్తులు
- నిందితుల్లో అత్యధిక మంది గుంటూరు వాసులే
- వైసీపీ కీలక నేత అనుచరుల ఆధ్వర్యంలోనే దాడి
- పాత్రధారులతోపాటు సూత్రధారులకు కూడా బిగుస్తున్న ఉచ్చు


బాధితులను పరామర్శిస్తున్న చంద్రబాబు (ఫైల్)

గుంటూరు, జూలై 1: తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై విచక్షణా రహితంగా దాడికి పాల్పడిన ఘటనపై పోలీసులు దృష్టి సారించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌పై జరిగిన దాడి ఘటన రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన విషయం విధితమే. నాటి సీఎం జగన్మోహన్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారనే కారణంతో 2021 అక్టోబరు 19న టీడీపీ కేంద్ర కార్యాలయంపై వైసీపీ అరాచకమూకలు దాడికి తెగబడ్డాయి. వైసీపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, స్థానిక ఎమ్మెల్యే ఆళ్ల రామ కృష్ణారెడ్డి, వైసీపీ యువ నాయకుడు దేవినేని అవినాష్‌ల ఆధ్వర్యంలో వారి అనుచరులే ఈ దాడికి పాల్పడినట్లు అప్పట్లో టీడీపీ శ్రేణులు ఆరోపించాయి. వైసీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకుడు పానుగంటి చైతన్య ఆధ్వర్యంలో గుంటూరు నుంచి పెద్దసంఖ్యలో అసాంఘిక శక్తులు, రౌడీషీ టర్లు దాడికి తెగబడ్డారని ఆరోపణలు వచ్చాయి. గుంటూరు, మంగళగిరి, విజయవాడ ప్రాంతాలకు చెందిన అసాంఘిక శక్తులు తొలుత వైసీపీ కేంద్ర కార్యాలయం వద్ద సమావేశమై అక్కడి నుంచి పెద్ద సంఖ్యలో కార్లు, ద్విచక్ర వాహనాలపై మూకుమ్మడిగా టీడీపీ కార్యాలయంపై దాడిచేశారు. ఆ సమ యంలో టీడీపీ కార్యాలయ ప్రధానద్వారం గేట్లు మూసిఉండగా బలవం తంగా వాటిని నేలమట్టం చేసి ఒక్కసారిగా కార్యాలయంలోకి చొరబడ్డా రు. తొలుత కార్యాలయ అద్దాలు, ఫర్నిచర్, దొరికిన వస్తువును దొరికినట్లు ధ్వంసం చేస్తూ బీభత్సం సృష్టించారు. ఈ దాడికి సంబంధిం చిన దృశ్యాలు అక్కడి సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. అంతేగాక పార్టీ నేతలు అందులో పనిచేసే సిబ్బంది తమ సెల్ ఫోన్లలో ఆయా దృశ్యాలను చిత్రీకరించారు. ఆయా సీసీ కెమెరాలో దాడికి పాల్పడిన అత్యధిక మంది ముఖాలు దాదాపుగా స్పష్టంగా కనిపించాయి. దీంతో వారందరిని గుర్తించేందుకు పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు సాగిస్తున్నారు.

దాడికి నేతృత్వం వహించిన వైసీపీ విద్యార్థి నేత పానుగంటి చైతన్య

గత వైసీపీ ప్రభుత్వంలో గుంటూరులో అన్ని తానే అన్నట్లుగా ఎమ్మెల్సీ అప్పిరెడ్డి ప్రధాన అనుచరుడిగా రెచ్చిపోయిన పానుగంటి చైతన్య టీడీపీ కార్యాలయంపై దాడికి నేతృత్వం వహించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆయన ఆధ్వర్యంలో గుంటూరులోని గుజ్జనగుండ్ల, మారుతీనగర్, ఏటి అగ్రహారం, పాతిమానగర్, రామిరెడ్డినగర్, నల్లచెరువు, ఏటుకూరురోడ్డు, పాత గుంటూరు, శ్రీనగర్ తదితర అనేక ప్రాంతాలకు చెందిన యువకులు పెద్ద సంఖ్యలో ఈ దాడికి తెగబడ్డారు. ముఖ్యంగా ఇందులో పలువురు వైసీపీ కార్పొరేటర్లు, షాడో కార్పొరేటర్లు, డివిజన్ పార్టీ అధ్యక్షులు, నగర, జిల్లా వైసీపీ నాయకులు కీలకంగా వ్యవహరించారు. ఇరువురు మహిళా కార్పొరేటర్ల భర్తలు తమ డివిజన్ల నుంచి పెద్ద సంఖ్యలో యువకులను సమీకరించి ఈ దాడికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. పలువురు రౌడీషీటర్లు, మాజీ రౌడీషీటర్‌లు కూడా ఈ దాడిలో పాల్గొనడం కలకలం రేపింది.

చైతన్య సహా పలువురు అజ్ఞాతంలోకి..

అయితే సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వారి అంచనాలను మించి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో షాక్‌కు గురైన చైతన్య అదే రోజు నగరం విడిచి అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఆయనతో పాటు పలువురు కీలక నాయకులు కూడా అజ్ఞాతంలోకి వెళ్లారు. ప్రస్తుతం చైతన్య బెంగళూరులో తలదాచుకుంటున్నట్లు పోలీస్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

మరోసారి వైసీపీనే తిరిగి అధికారంలోకి వస్తుందని భావించిన అనేకమంది అసాంఘిక శక్తులు గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అరాచకాలకు తెగబడ్డారు. ముఖ్యంగా వైసీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకుడిగా చలామణి అవుతున్న పానుగంటి చైతన్య మరింతగా రెచ్చిపోయారు. మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల నుంచి ఇటీవల జ రిగిన సార్వత్రిక ఎన్ని కల పోలింగ్ వరకు వీరి ఆగడాలు శ్రుతి మించాయి. గత ఎన్నికల పోలింగ్ రోజున భారత్ పేటలోని పోలింగ్ బూత్ వద్ద జేబులో నోట్ల కట్టలతో నిలబడి పోలింగ్‌బూత్‌లోకి వెళ్లేవారికి డబ్బులు ఇస్తూ ప్రలోభాలకు గురిచేశాడు. అడ్డుకునేం దుకు ప్రయత్నించిన టీడీపీ అభ్యర్థి భర్తపై పోలీసులతో దాడి చేయించాడు. పోలింగ్ బూత్ వద్ద గొడవకు దిగాడు. గొడవ విషయం తెలుసుకు ని ఎంపీ గల్లా జయదేవ్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు బూత్ వ ద్దకు రాగా జయదేవ్ కారు అద్దం పగలగొట్టి ఆయనపై దాడికి యత్నిం చాడు. అలాగే ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్ రోజున లిటిల్ ఫ్లవర్స్ స్కూల్ బూత్ వద్ద టీడీపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్ర శేఖర్‌పై ఎగబడి తీవ్రస్థాయిలో దూషించాడని కూడా తెలుగుదేశం కార్యక ర్తలు వాపోతున్నారు. అంతేగాక జిల్లావ్యాప్తంగా గుట్కా వ్యాపారమంతా ఈయన చేతుల్లోనే జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. నగరంలోని రోడ్ల వెంట తోపుడుబండ్ల వ్యాపారుల నుంచి నెలవారి వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలున్నాయి. ముఖ్యంగా ప్రధాన జంక్షన్లలో వ్యాపారానికి డిమాండ్ ఉన్నచోట వారిని ఖాళీ చేయించి వేరొకరికి ఇప్పించి పెద్దమొత్తంలో డబ్బు వసూలు చేసినట్లు కూడా ఆరోపణలు ఉన్నాయి. ఇవేగాక అనేక అనైతిక కార్యకలాపాలలోనూ ఆయన పాత్ర ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి.


దాడిలో ధ్వంసమైన కార్యాలయ అద్దాలు (ఫైల్)

టీడీపీలో చేరతామంటూ చైతన్య సహా పలువురు నేతల రాయబేరాలు

వైసీపీ ప్రభుత్వ హయాంలో రెచ్చిపోయిన చైతన్య సహా పలువురు షాడో కార్పొరేటర్లు, వైసీపీ నాయకులు, టీడీపీ కార్యాలయంపై దాడి కేసు నిందితులు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పార్టీ మారేందుకు సిద్ధమయ్యారు. ఇంకా తాము వైసీపీలోనే కొనసాగితే తమను టార్గెట్ చేస్తారని, ఆయా కేసుల్లో ఇబ్బందిపడతామని భయపడిన ఆయా నేతలు ఇప్పటికే పార్టీ మారేందుకు సిద్ధపడినట్లు తెలుస్తోంది. దీంతో ఇప్పటికే వారు టీడీపీలో వివిధ హోదాల్లో ఉన్న నేతలను సంప్రదించినట్లు తెలుస్తోంది. తాను టీడీపీలో చేరతానంటూ చైతన్య టీడీపీకి చెందిన నేతలను సంప్రదించగా వారినుంచి స్పష్టమైన హామీ లభించలేదని తెలిసింది. గత ప్రభుత్వంలో చైతన్య అరాచకాలతో పాటు టీడీపీ కార్యాలయంపై దాడిలో పాత్రధారిగా ఇప్పటికే తెలుగుదేశం పార్టీ గగ్గోలు పెడుతున్న సమయంలో ఆయనను పార్టీలోకి తీసుకుందామని ప్రతిపాదిస్తే పార్టీ క్యాడర్ రియాక్షన్ తీవ్రంగా ఉంటుందని భయపడి వెనుకంజ వేసినట్లు సమాచారం.


సీఎం చంద్రబాబుని కలిసిన రైల్వే అధికారులు

రైల్వే ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తిచేయాలి

- సీఎం చంద్రబాబు ఆదేశం

గుంటూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): రైల్వే ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రైల్వే అధికారులను ఆదేశించారు. సోమవారం దక్షిణమధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్‌కు సీఎం కార్యాలయం నుంచి పిలుపు రాగా ఆయన గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్ ఎం రామకృష్ణ, ఇతర అధికారులు, విజయవాడ డివిజన్ అధికారులతో కలిసి ఉండవల్లి సీఎం నివాసానికి వెళ్లారు. సీఎం చంద్రబాబుతో సమావేశమై వివిధ అంశాలపై చర్చించారు. త్వరలో రాష్ట్ర, కేంద్ర బడ్జెట్ సమావేశాలు జరగనుండటంతో ఈ భేటీకి ప్రాధాన్యం సంతరించుకొన్నది. సమావేశంలో ప్రధానంగా ఏపీలో పెండింగ్ రైల్వే ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు ఆరా తీశారు. అమరావతి రాజధానికి నూతన రైలుమార్గం, నడికుడి - శ్రీకాళహస్తి, గుంటూరు - గుంతకల్లు రైల్వేడబ్లింగ్, ఆర్‌వోబీ, ఆర్‌యూబీల వంటి వివిధ అంశాలపై చర్చించారు. వచ్చే ఐదేళ్లలో రైల్వే, రాష్ట్ర ప్రభుత్వం సమన్వయంతో ప్రాజెక్టులు పూర్తి చేయాలని ఈ సందర్భంగా నిర్ణయించారు. రైలుమార్గాలకు అవసరమైన భూములను సేకరించి ఇచ్చేందుకు సీఎం చంద్రబాబు సుముఖత వ్యక్తపరిచారని రైల్వేవర్గాలు తెలిపాయి.

పింఛన్ పంపిణీలో సచివాలయ ఉద్యోగి చేతివాటం

- ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే జూలకంటి
- విచారించి సస్పెండ్ చేసిన మున్సిపల్ కమిషనర్ వెంకటదాసు


చేతివాటం ప్రదర్శించిన వాలునాయక్

మాచర్ల రూరల్, జూలై 1: రాష్ట్ర వ్యాప్తంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలో పింఛన్ల పంపిణీ అట్టహాసంగా ప్రారంభమైంది. పింఛన్ల పంపిణీలో అవినీతికి తావు ఉండకూడదని పదే పదే సూచించినప్పటికీ కిందిస్థాయి ఉద్యోగులు తమ చేతివాటం మాత్రం మానుకోలేదు. సోమవారం మాచర్ల పట్టణంలోని 9వ వార్డు ఎరుకల కాలనీలో సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ మూఢావత్ వాలునాయక్ తన వార్డులో పింఛన్ పంపిణీ చేశారు. ఈ క్రమంలో 27 మంది పింఛన్ లబ్ధిదారుల నుంచి ఒక్కొక్కరి వద్ద రూ.500 కట్ చేసి రూ.6500 చొప్పున అందించారు. మరో లబ్ధిదారుని వద్ద వేలిముద్ర తీసుకొని డబ్బులు ఇవ్వకుండానే ఉడాయించాడు. దీనిపై లబ్ధిదారులు టీడీపీ నేతల దృష్టికి తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పింఛన్ల పంపిణీలో అవినీతికి పాల్పడడమేంటంటూ ఆగ్రహించారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ వెంకటదాసు 9వ వార్డుకు చేరుకొని మూఢావత్ వాలునాయక్‌ను విచారించి సస్పెండ్ చేశారు.

అక్రమంగా తరలిస్తున్న

36 కిలోల వెండి వస్తువుల పట్టివేత

చిలకలూరిపేట, జూలై 1: స్థానిక ఎన్ఆర్‌టీ సెంటర్‌లో ఆదివారం రాత్రి అర్బన్ పోలీసులు అనుమానాస్పదంగా జాతీయ రహదారిపై వెళ్తున్న ఒక కారును ఆపి తనిఖీ చేశారు. ఈ తనిఖీలో 36 కిలోల వెండి వస్తువులు నాలుగు బ్యాగ్‌లలో ఉంచి తరలిస్తున్నట్టు పోలీసులు కనుగొన్నారు. వాటి విలువ సుమారు రూ 23.60 లక్షలు ఉంటుందని అంచనాగా ఉంది. వాటికి సరైన బిల్లులు చూపకపోవటంతో పోలీసులు వెండి వస్తువులను స్వాధీనం చేసుకొని వాణిజ్య పన్నుల శాఖ అధికారికి అందజేశారు. విజయవాడ నుంచి ఈ వస్తువులను మార్కాపురానికి తరలిస్తున్నట్టు భావిస్తున్నారు. కారులో ఉన్న అర్జున్‌సింగ్, సూర్‌సింగ్, విక్రసింగ్ అనే ముగ్గురు వ్యక్తులు ఈ వెండి వస్తువులను తరలిస్తున్నట్టు అర్బన్ సీఐ పీ రమేష్ సోమవారం తెలిపారు. మధ్యవర్తుల సమక్షంలో ఈ వస్తువులను వాణిజ్య పన్నుల శాఖ అధికారి మల్లిఖార్జున్‌కు అందజేశామని చెప్పారు.

పండుగ వాతావరణంలో పెన్షన్ల పంపిణీ

- జగన్ ప్రభుత్వం రూ.వెయ్యి పెంచడానికి ఐదేళ్లు పట్టింది
- పెన్షన్ పెంచిన ఘనత చంద్రబాబుదే
- రెవెన్యూశాఖలో ప్రక్షాళన
- వేల ఎకరాల ప్రభుత్వ భూమిని అడ్డగోలుగా దోచుకుంది వైసీపీ ప్రభుత్వం
- రెవెన్యూశాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్


చిన్నమట్లపూడిలో వృద్ధురాలికి పింఛన్‌ను అందిస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

రేపల్లె, జూలై 1: రాష్ట్రమంతా పండుగ వాతావరణంలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ప్రజలకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తుందని రెవెన్యూశాఖామంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. సోమవారం నియోజకవర్గంలో ఎన్టీఆర్ భరోసా, పింఛన్ నగదు పంపిణీని మంత్రి ప్రారంభించారు. ఉదయం 6గంటల నుంచే ఆయన గ్రామాల్లో పర్యటించి లబ్ధిదారులకు పింఛన్‌లు పంపిణీ చేశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ తక్షణమే అమలు చేస్తూ ఒక్కొక్కరికి రూ.7వేల చొప్పున నగదును అందిస్తున్నామన్నారు. రూ.3వేల నుంచి రూ.4వేలకు పింఛన్ పెంపుదల, గడిచిన మూడు నెలలకు సంబంధించి నెలకు రూ.వెయ్యి చొప్పున రూ.3వేలతో కలిపి రూ.7వేలు అందిస్తున్నామని పింఛన్‌దారులకు అనగాని తెలిపారు. రాష్ట్రంలో 65లక్షల 30వేల మందికి పెన్షన్‌లను అందిస్తున్నామని, ఒక్క రేపల్లె నియోజకవర్గంలోనే రూ.30కోట్లు వివిధ రకాల పెన్షన్‌లను లబ్ధిదారులకు అందించామన్నారు. పేద ప్రజల ఆకాంక్షలను నెరవేర్చటమే తమ లక్ష్యమని, జగన్ ప్రభుత్వంలో పెన్షన్‌ల విషయంలో పేద ప్రజలు ఎంతో క్షోభకు గురయ్యారన్నారు. పెన్షన్‌ను రూ.వెయ్యికి పెంచేందుకు జగన్‌కు నాలుగు సంవత్సరాలు పట్టిందని, టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.వెయ్యి ఒక్కసారే పెంచి పింఛన్‌లు అందిస్తున్నామన్నారు. రాష్ట్రాన్ని జగన్ పాలనలో అప్పుల ఊబిలోకి దించారని, అన్ని ప్రాంతాలను విచ్ఛిన్నం చేసి ప్రజల మధ్య రాగద్వేషాలను పెంచేలా కుటిల రాజకీయాలు చేశారన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధిలో 30సంవత్సరాలు వెనక్కి తీసుకెళ్లిన ఘనత జగన్‌దేనన్నారు. ప్రభుత్వ భూములను జగన్‌అండ్‌కో అడ్డదారిలో తక్కువ ధరకే దోచుకున్నారన్నారు. తవ్విన కొద్ది వైసీపీ ప్రభుత్వం రెవెన్యూ శాఖలో చేసిన అక్రమాలు బయటపడుతున్నాయన్నారు. త్వరలో వీటన్నింటిపై శ్వేత పత్రాన్ని విడుదల చేస్తామన్నారు. అడ్డగోలుగా భూములపై జీవోలు ఇచ్చిన వాటిని చట్టప్రకారం వెనక్కి తీసుకుంటామన్నారు. జగన్ పాలనలో అంతా అవినీతి, అరాచకం జరిగిందని, అధికారుల మెడపై కత్తి పెట్టి అడ్డగోలుగా దోచేసుకున్నారన్నారు. రెవెన్యూశాఖను ప్రక్షాళన చెయ్యనున్నట్లు తెలిపారు. ప్రజలు ఎంతో నమ్మకంతో ఎన్డీయే కూటమి ప్రభుత్వాన్ని అఖండ మెజార్టీతో గెలిపించారని, వారి నమ్మకాన్ని వమ్ముచెయ్యకుండా రాష్ట్రాభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, ఆర్డీవో హేలా షారోన్, మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకటసుబ్బయ్య, టీడీపీ రాష్ట్ర నాయకులు పంతాని మురళీధర రావు, అనగాని శివప్రసాద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చదువు, అభివృద్ధి సంతోషంగా జరగాల్సిన ప్రక్రియ

విజ్ఞాన్స్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య


మాట్లాడుతున్న డాక్టర్ లావు రత్తయ్య

గుంటూరు(విద్య), జూలై 1: చదువు, అభివృద్ధి సంతోషంగా జరగాలని విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య పేర్కొన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీ సోమవారం నుంచి బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు తరగతులను ప్రారంభించింది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరయ్యారు. సభకు ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ రత్తయ్య మాట్లాడుతూ తమ యూనివర్సిటీలో విద్యార్థులను చేర్పించిన తల్లిదండ్రులకు ధన్యవాదాలు, విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. విజ్ఞాన్స్ యూనివర్సిటీ ప్రత్యేకంగా నిర్వహిస్తున్న పంచసూత్రాల (ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్, ప్లానింగ్, ట్రైనింగ్, కమ్యూనికేషన్ సిస్టమ్, కౌన్సెలింగ్ సిస్టమ్, సీఆర్‌టీ తరగతులు, బోధన పద్ధతి) వల్లే తమ దగ్గర చదివిన విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహిస్తున్నారని పేర్కొన్నారు. తల్లిదండ్రులందరూ మీ పిల్లలను బాగా ప్రోత్సహించినట్లైతే వారు ఆరోగ్యంగా, మానసికంగా, సర్వతోముఖంగా అభివృద్ధి చెందుతారని తెలియజేశారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పీ నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.40
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	125, 134,145
చికెన్ విత్ స్కిన్	236.00
చికెన్ స్కిన్ లెస్	246.00

జీఎస్‌టీతో బలమైన ఆర్థికశక్తిగా భారత్

- పన్నుల రంగంలో అతి పెద్ద సంస్కరణ జీఎస్‌టీనే
- డీఆర్ఎం రామకృష్ణ



ప్రసంగిస్తున్న డీఆర్ఎం రామకృష్ణ. వేదికపై సీజీఎస్‌టీ గుంటూరు కమిషనర్ నరసింహారెడ్డి, టుబాకో బోర్డు ఈడీ శ్రీధర్ తదితరులు

గుంటూరు, జూలై 1: గూడ్స్ సర్వీస్ టాక్స్ (జీఎస్‌టీ)తో భారత్ బలమైన ఆర్థిక శక్తిగా ఆవిర్భవించిందని గుంటూరు డివిజనల్ రైల్వే మేనేజర్ ఎం రామకృష్ణ పేర్కొన్నారు. సీజీఎస్‌టీ గుంటూరు కమిషనర్ సాధు నరసింహారెడ్డి అధ్యక్షతన జీఎస్‌టీ 8వ వార్షికోత్సవం జీటీ రోడ్డులోని టుబాకో అసోసియేషన్ హాల్లో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా డీఆర్ఎం మాట్లాడుతూ పన్నుల రంగంలో అతి పెద్ద సంస్కరణ జీఎస్‌టీయేనన్నారు. తద్వారా పన్నుల్లో భారీ మార్పులు వచ్చి, పన్నుల వ్యవస్థ పూర్తిగా చక్కబడిందన్నారు. దేశ ఆర్థికవ్యవస్థకు జీఎస్‌టీతో మంచి ప్రయోజనం చేకూరిందని తెలిపారు. టుబాకో బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ జీఎస్‌టీ కౌన్సిల్ సమావేశాలకు ఉత్తరాఖండ్ స్టేట్ నుంచి తాను హాజరైనట్లు తెలిపారు. జీఎస్‌టీ అనేది వినియోగదారులకు, ఉత్పత్తిదారులకు మేలు చేసేదిగా ఉందన్నారు. స్టేట్, సెంట్రల్ జీఎస్‌టీ అధికారులు పరస్పర సహకారంతో పనిచేయాలని సూచించారు. సెంట్రల్ జీఎస్‌టీ గుంటూరు కమిషనర్ సాధు నరసింహారెడ్డి మాట్లాడుతూ గత పదేళ్లలో జీఎస్‌టీ వసూళ్ళు ఆర్థికంగా గణనీయమైన వృద్ధిని సాధించాయన్నారు. ఈ సందర్భంగా అత్యధికంగా జీఎస్‌టీ చెల్లించిన పన్ను చెల్లింపుదారులకు టాప్ టాక్స్ పేయర్స్ సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం విధి నిర్వహణలో ప్రతిభచూపిన ఉద్యోగులకు, సోషల్ వర్కర్లకు, ఆరోగ్యవీరులకు ప్రశంసాపత్రాలను బహూకరించారు. రాష్ట్రపతి అవార్డు పొందిన ఐఆర్ఎస్ అధికారి, రిటైర్డ్ అసిస్టెంట్ కమిషనర్ వీరవల్లి అంకినీడు ప్రసాద్‌ను ప్రత్యేక ఆహ్వానితులుగా జ్ఞాపికతో సత్కరించారు. అలాగే క్రీడల్లో విజేతలుగా నిలిచిన ఉద్యోగులు, వారి పిల్లలకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో సెంట్రల్ జీఎస్‌టీ అడిషనల్ కమిషనర్లు జీ రామకృష్ణరాజుయాదవ్, ఉపేంద్రకుమార్ ధృవ్, అసిస్టెంట్ కమిషనర్‌లు రవికుమార్, నాగరాజు, సీతారామరాజు, సూపరింటెండెంట్లు గాదె శ్రీనివాసరెడ్డి, టీవీజీకే మూర్తి, యుగంధర్, నవీన్‌రాజు, ఈశ్వరరావు, చిట్టి, గద్దె తిలక్, వివేకానంద తదితరులున్నారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

- విశాఖలో సాధువుల నుంచి కొనుగోలు
- పొట్లాలు కట్టి ఇక్కడ విక్రయం
- మూడున్నర కిలోల గంజాయి స్వాధీనం


గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్టు చూపుతున్న సీఐ వినోద్‌కుమార్

మంగళగిరి సిటీ, జూలై 1: అక్రమమార్గంలో డబ్బు సంపాదించాలని చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని మంగళగిరి పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. మంగళగిరి పట్టణ పోలీసుస్టేషన్‌లో సీఐ డి.వినోద్‌కుమార్ నిందితుడి వివరాలను వెల్లడించారు. తాడేపల్లి మార్కెట్ సెంటరు ప్రాంతానికి చెందిన గరిక శ్రీనివాసరావు గంజాయికి బానిసగా మారాడు. చెడు అలవాటునే వృత్తిగా మలుచుకుని గంజాయి విక్రయాలు జరుపుతున్నాడు. విశాఖపట్నం బీచ్ ప్రాంతానికి వెళ్లి అక్కడ సాధువుల వద్ద కిలోల కొద్దీ గంజాయి తీసుకువచ్చి దానిని చిన్న చిన్న పొట్లాలుగా కట్టి మంగళగిరి, తాడేపల్లి ప్రాంతాల్లో విక్రయిస్తున్నాడు. నాలుగు రోజుల క్రి తం విశాఖపట్నం ఆర్కే బీచ్ వద్దకు వెళ్లి తనకు పరిచయం వున్న సాధువు వద్ద రూ.35వేల విలువైన మూడున్నర కిలోల గంజాయిని కొనుగోలు చేసి మంగళగిరి ఎయిమ్స్ ఆసుపత్రి మార్గంలోని చెట్లపొదల్లో దాచాడు. సమాచారం అందుకున్న మంగళగిరి పట్టణ ఎస్ఐ షేక్ ఖాదర్‌బాషా సిబ్బందితో కలిసి దాడి చేసి నిందితుడు శ్రీనివాసరావును అదుపులోకి తీసుకుని, మూడున్నర కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో పోలీసుసిబ్బంది సీహెచ్ కిరణ్‌కుమార్, ఎ.వేణుగోపాల్, యూఎస్ కిరణ్‌కుమార్, వి.ప్రసాదరావు పాల్గొన్నారు.

27,904 టిక్కీల మిర్చి అమ్మకం

గుంటూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 32,157 టిక్కీల మిర్చి విక్రయానికి రాగా అందులో 27,904 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డులో 16,461 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	8000	16200
నెంబరు. 5	13500	15000
273	--	--
341	8500	16000
4884	--	--
సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	20000
బ్యాడిగి	8500	15500
తెల్లకాయలు	5000	12000

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఏసీ కామన్ వెరైటీ		
334	8500	17000
నెంబరు 5	9000	9000
273	13500	13500
341	13500	13500
4884	13000	14000
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	9000	19500
బ్యాడిగి	9000	16000
దేవనూరుడీలక్స్	13700	13700
తెల్లకాయలు	5000	11500

పోలవరంపై ఆసక్తికరమైన సంభాషణ

● పెనుమాక యువతి కృష్ణప్రియ ప్రశ్నకు చంద్రబాబు సవివరంగా జవాబు

గుంటూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పింఛన్ల పండగ సందర్భంగా గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం పెనుమాకలో సోమవారం జరిగిన ప్రజావేదిక ముఖాముఖీలో ఆసక్తికరమైన సంభాషణ జరిగింది. పెనుమాక గ్రామానికి చెందిన కావూరి కృష్ణప్రియ పోలవరం ప్రాజెక్టు గురించి అడిగిన ప్రశ్నకు సీఎం చంద్రబాబునాయుడు సుదీర్ఘమైన జవాబు చెప్పారు. పోలవరం సాంకేతికపరమైన అంశమైనా రాష్ట్ర ప్రజలందరూ అవగాహన చేసుకోవాలని సూచించారు. ఆ సంభాషణ సాగింది ఇలా...

కృష్ణప్రియ: సార్ మీరు ఎప్పుడూ సంక్షోభంలో అవకాశాలు వెతుక్కోవాలంటారు. మొన్న శ్వేతపత్రం కూడా విడుదల చేశారు. దాంట్లో పోలవరం ప్రాజెక్టు ఎప్పుడు పూర్తి అవుతుంది అంటే మీరు చెప్పలేదు కదా?

సీఎం చంద్రబాబు: నా తల్లి... చాలా తెలివెక్కువైపోయింది మీ అందరికి. ఇప్పుడు పోలవరంలో వచ్చిన సమస్య ఏమిటంటే... అక్కడ డయా ఫ్రం వాల్ ఒకటి ఉంటుంది. రాష్ట్రంలో ఉన్న అందరికి అర్థం కాలేదు. ఎక్కడైనా నదిలో ప్రాజెక్టు వస్తుంది. పోలవరం విషయంలో నదినే మళ్లించి డ్యాం కడుతున్నాం. ఈ నీళ్ల పక్కకు తీసుకొచ్చి అక్కడ ఎర్త్‌కండ్యాం కడతాం. పోలవరంలో కిందన పొరలన్నీ ఇసుక పొరలున్నాయి. నీళ్లు అన్ని వెళ్లిపోతాయి. వాటిని అరెస్టు చేయాలి. అందుకు స్పెషల్ టెక్నాలజీతో 95 మీటర్ల లోతు వరకు కట్టడం కట్టాలి. దానికి జర్మనీ కంపెనీ వచ్చి డయా ఫ్రం వాల్ కట్టింది. దానికి నేను ఏమి చేశానంటే పోలవరంలో ఆరు నెలలే పనులు అవుతాయి. జూలైలో వర్షాలు వస్తాయి. డిసెంబరు వరకు వరదలు ఉంటాయి. అప్పటి నుంచి మే నెలాఖరు వరకు పనులు చేయాలి. నేను కష్టపడి రెండు సీజన్లలో చాలా ఇబ్బందులు పడి డయాఫ్రం వాల్ పూర్తి చేశాను. తర్వాత స్పిల్ వే కట్టాం. అవన్నీ పూర్తి అయ్యాయి. డయాఫ్రం వాల్ పని పూర్తి చేయాలంటే రెండు కాఫర్ డ్యాంలు కట్టాలి. నీళ్లు రాకుండా డ్రౌటింగ్ చేసి అక్కడి నుంచి కట్టుకొంటూ రావాలి. సరిగ్గా మేలో మేము అధికారం కోల్పోయాం. మే, జూన్ వరకు పనులు జరిగి ఉంటే డయాఫ్రం వాల్, కాఫర్ డ్యాంలు పూర్తి అయ్యేవి. ఎన్ని లక్షల క్యూసెక్కుల నీళ్లు వచ్చినా అక్కడికి వచ్చేవి కాదు. చిన్న గ్యాప్ ఉంటే కాంట్రాక్టర్, అధికారులను మార్చారు. వర్షాలు వచ్చాయి. రెండు ఏళ్లు పట్టించుకోలేదు. నీళ్లు వచ్చి డయాఫ్రం వాల్ వద్ద సుడులు తిరిగాయి. దేశంలో భారీగా వరద వచ్చే నదుల్లో ప్రధానమైనది గోదావరి. 30 లక్షల క్యూసెక్కులకు పైగా వరద వచ్చి సుడులు తిరిగాయి. దాంతో కాఫర్ డ్యాంలు, డయాఫ్రం వాల్ దెబ్బతిన్నాయి. దేశంలోనే అత్యున్నతమైన సంస్థ అయిన సీడబ్ల్యూసీ చెప్పింది ఫైనల్. ఇప్పుడు వాళ్లు కూడా చేతులెత్తేశారు. డయాఫ్రం వాల్‌ని రూ.446 కోట్లతో పూర్తిచేశాం. ఇప్పుడు మూడు చోట్ల కోసుకుపోయింది. దానికి రూ.447 కోట్లు కావాలి. మరమ్మతులు చేసినా చెప్పలేం అంటున్నారు. మొత్తం కట్టాలంటే రూ.990 కోట్లు కావాలి. పైన కాఫర్ డ్యాంలు దెబ్బతిన్నాయి. అక్కడి నుంచి నీళ్లు వస్తున్నాయి. ఇవన్నీ ఎలా చేయాలో నాకు తెలియదు. నేను పరిపాలకుడిని. ఇప్పుడు అమెరికా, కెనడా నుంచి నిపుణులను తీసుకొచ్చి స్టడీ చేస్తున్నాం. వాళ్లు ఏమి చెబితే దాని ప్రకారం పనులు పూర్తి చేయాలి. ఆయన(జగన్) రివర్స్ టెండర్ అన్నాడు. రూ.500, 600 కోట్లు ఆదా అన్నాడు. ఇప్పుడు నష్టం రూ. 70 వేల కోట్లు. అది రూ. లక్ష కోట్లకు పెరుగుతుంది. ఒక దుర్మార్గుడు దుర్మార్గమైన ఆలోచనతో పోలవరంని గోదావరిలో ముంచి మళ్లీ అడ్డదిడ్డంగా వాదన చేసేందుకు ఈ రోజున ముందుకొస్తున్నాడు. ఆరోజున పెద్దలందరూ వాదించారు. కాంట్రాక్టర్‌ని మార్చొద్దన్నారు. రెండు, మూడు రోజులు ఆగమన్నారు. పీపీఏ మీటింగ్ పెట్టి ఈయనకు చెప్పారు. తొందరపడొద్దన్నారు. గతంలోనూ ఇలానే జరగడం వలన నష్టం జరిగిందన్నారు. పాత, కొత్త కాంట్రాక్టర్ మధ్యలో ప్రాజెక్టు మునిగిపోతే ఎవరిని అడగాలో తెలియదన్నారు. అయినప్పటికీ వినకుండా ప్రాజెక్టుకి ఈ దుస్థితిని పట్టించారు. ఇది టెక్నికల్ సబ్జెక్టు అయినా అందరూ తెలుసుకోవాలి. అని చంద్రబాబునాయుడు వివరించారు.



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న భాష్యం రామకృష్ణ

వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనది

● భాష్యం మెడెక్స్ నేషనల్ డాక్టర్స్ డేలో వక్తలు

గుంటూరు(విద్య),జూలై 1: సమాజంలో వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనదని ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఎడ్యుకేషన్ అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ రఘునందన్ అన్నారు. సోమవారం స్థానిక వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో భాష్యం మెడెక్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ డాక్టర్స్ డే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రఘునందన్ మాట్లాడుతూ సమాజంలో వైద్యవృత్తి ఉన్నతమైన పాత్ర పోషిస్తుందన్నారు. ప్రజల ఆరోగ్యం మీ చేతుల్లో ఉంటుందని, ఈ విషయాన్ని ప్రతి ఒక్క వైద్య విద్యార్థి గుర్తెరిగి నడుచుకోవాలన్నారు. అనంతరం వైద్య విద్యార్థుల కోసం ప్రముఖ సైకాలజిస్ట్, మోటివేషనల్ స్పీకర్ సుధీర్‌కుమార్ సంద్ర ఆధ్వర్యంలో మోటివేషనల్ సెమినార్ నిర్వహించారు. పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా విద్యార్థులకు సూచనలందిస్తూ అవగాహన కల్పించారు. భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ వైద్య వృత్తి అన్ని వృత్తులలో కన్నా ఉత్తమమైనదని, కార్యక్రమంలో భాష్యం మెడెక్స్, మెడి ఎయిమ్స్ ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యూపీఐ యాప్స్‌లో విద్యుత్ బిల్లులు చెల్లించొద్దు

● గుంటూరు టౌన్-1 ఈఈ శ్రీనివాసబాబు

గుంటూరు, జూలై 1: ఇకపై విద్యుత్ బిల్లులను డిజిటల్ చెల్లింపుల్లో భాగంగా ఫోన్‌పే, జీపే, పేటీఎం ఇతర యూపీఐ యాప్స్‌లో చెల్లించవద్దని, ఆర్‌బీఐ మార్గదర్శకాలకనుగుణంగా డిస్కంలు ఈనిర్ణయం తీసుకున్నట్లు గుంటూరు టౌన్-1 ఈఈ టీ.శ్రీనివాసబాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇకపై యూపీఐ యాప్స్‌లో కూడా ఏపీసీపీడీసీఎల్ పేరు కనిపించదన్నారు. వినియోగదారులు గూగుల్ ప్లేస్టోర్‌లో ఏపీసీపీడీసీఎల్ యాప్ ను డౌన్‌లౌడ్ చేసుకోవాలని కోరారు. డిస్కంల యాప్స్ నుంచి వెబ్‌సైట్ల నుంచి మాత్రమే బిల్లులు చెల్లించాలని కోరారు. అలాగే డెబిట్, క్రెడిట్, నెట్ బ్యాంకింగ్, వాలెట్స్, క్యాష్ కార్డ్స్ ద్వారా కూడా బిల్లులు చెల్లించవచ్చన్నారు.

4న విద్యా సంస్థల బంద్

గుంటూరు(విద్య), జూలై 1: నీట్ పరీక్ష పేపర్ లీకేజ్‌ను నిరసిస్తూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో 4న జరిగే బంద్‌ను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం కిరణ్ విజ్ఞప్తి చేశారు. బ్రాడీపేటలోని కార్యాలయంలో శనివారం విద్యార్థి సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ గుంటూరు జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్ మాట్లాడుతూ ఈ రోజుల్లో విద్యార్థులు బయటకు వచ్చి నిరసనలను తెలియజేస్తున్న అక్రమ కేసులు పెట్టి విద్యార్థులను అణచివేస్తున్న పరిస్థితి. కేంద్ర ప్రభుత్వం విద్యార్థి వ్యతిరేక విధానాలను అవలంబిస్తా ఉంది. ఇటీవల దేశవ్యాప్తంగా ఎన్‌టిఏ ఆధ్వర్యంలో నిర్వహించిన నీట్ పరీక్షల నిర్వహించింది. ఈ పరీక్షలో రాసి నష్టపోయిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలి. జీవో 77ను రద్దుతో పాటు పలు డిమాండ్స్‌తో బంద్ చేపడుతున్నట్లు ప్రకటించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నాజర్, ఎస్.ఎస్.యు.ఐ జిల్లా అధ్యక్షుడు కరీం, ఎస్.ఎఫ్.ఐ జిల్లా అధ్యక్షుడు షేక్ సమీర్,ఎస్.ఎఫ్.ఐ జిల్లా నాయకులు పాల్గొన్నారు.



పెన్షన్ పంపిణీ చేస్తున్న పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, పక్కన కమిషనర్ కీర్తి చేకూరి

పండుటాకుల పండుగ..

● నగరంలో వేడుకగా పింఛన్ల పంపిణీ కార్యక్రమం
● పాల్గొన్న ప్రజాప్రతినిధులు, కూటమి నేతలు, అధికారులు
● లబ్ధిదారుల మోములో వెల్లివిరిసిన ఆనందం

గుంటూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పింఛను పంపిణీ కార్యక్రమం పండుటాకుల పండగలా జరిగింది. ఒకేసారి రూ.1000 పెంచి రూ.4 వేల ఇవ్వడంతో పాటు, ఏప్రిల్ నుంచి బకాయిలు మొత్తంగా రూ. 7 వేలు పింఛను ఒకేసారి ఇవ్వడంతో లబ్ధిదారులు మోములో ఆనందం వెల్లివిరిసింది. అవ్వాతాతలు వయసు మరిచి సంబరాలు చేసుకున్నారు. వితంతువులు, ఒంటరి మహిళలు తమ బాధలు మరిచి సంతోషంలో మునిగిపోయారు. కార్యక్రమాల్లో స్వయంగా కూటమి ఎమ్మెల్యేలు, అధికార పార్టీలైన టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలు పాల్గొనడంతో సంబరాలు అంబరాన్ని అంటాయి. స్థానిక ఎమ్మెల్యేలు, మూడు పార్టీల నేతలు స్వయంగా లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలుపుకున్నారు.

రాష్ట్రంలో సంక్షేమ పండుగ ప్రారంభం : కోవెలమూడి రవీంద్ర

ఏపీలో తొలి సంక్షేమ పండుగ ప్రారంభమయిందని టీడీపీ జోన్- 5 ఇన్‌చార్జి కోవెలమూడి రవీంద్ర అన్నారు. పశ్చిమ నియోజకవర్గంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం తెలతెలవారుతుండగానే ఎన్టీఆర్ భరోసా పింఛనును రూ. 7వేలు అందజేయడం తమ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్రపటానికి కోవెలమూడి క్షీరాభిషేకం చేశారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం : డేగల ప్రభాకర్

ఇచ్చిన మాట ప్రకారం ఏప్రిల్ నుంచి రూ.4వేలు పింఛను ఇస్తున్నామని టీడీపీ నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్ అన్నారు. గుంటూరు తూర్పు, తాడికొండ నియోజకవర్గాలలో నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో అయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వానికి పింఛను నగదు వెయ్యి రూపాయలు పెంచడానికి ఐదేళ్లు పట్టింది. ఎన్డీయే ప్రభుత్వంలో గెలిచిన నెలలోనే ఇచ్చిన మాటకి కట్టుబడి రూ.4వేలు ఇస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీ ప్రజల ఇళ్ల వద్దకే చేరుతాయన్నారు.

సంక్షేమ సృష్టికర్త చంద్రబాబు : కనపర్తి శ్రీనివాసరావు

రూ. 35ల పింఛన్‌ను రూ. 4 వేలకు తీసుకెళ్లిన ఘనత టీడీపీదేనని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు అన్నారు. గుంటూరు 42వ డివిజన్ కార్పొరేటర్ వేములపల్లి శ్రీరామప్రసాదు ఆధ్వర్యంలో వడ్డిగూడెం కాలనీలో జరిగిన ఎన్టీఆర్ భరోసా పింఛను పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలంటీర్ వ్యవస్థ లేకపోతే ప్రపంచమే ఆగిపోతుందని వారిని రెచ్చగొట్టి, స్వప్రయోజనాలకు వాడుకున్న వైసీపీ నాయకులు ఇకనైనా వాస్తవాలను గుర్తించాలన్నారు. ఎన్నికలకు ముందు కూటమి అధినేతగా చంద్రబాబు ఇచ్చిన హామీలన్నీ తప్పక నెరవేరుస్తారని అన్నారు. అనంతరం చంద్రబాబు చిత్రపటానికి పింఛన్ దారులు, టీడీపీ నేతలు క్షీరాభిషేకం నిర్వహించారు.

గుంటూరు తూర్పు నియోజకవర్గం 56వ డివిజన్ నెహ్రూనగర్ మోతీలాల్ నగర్‌లో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే నసీర్ హాజరయ్యారు. తెలుగు మహిళ రాష్ట్ర కార్యదర్శి గుడిపల్లి వాణి ఆధ్వర్యంలో పింఛన్లు అందించడంతో పాటు, వృద్ధులను శాలువాలతో సత్కరించి చీరలు, పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేసారు. కార్యక్రమంలో దాసరి రాజా మాస్టర్, బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు వేములకొండ శ్రీనివాస్, బిట్రగుంట మల్లిక, శంకర్, యర్రగోపు నాగేశ్వరరావు, షేక్ ఖాదర్, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల కళ్లల్లో ఆనందం: గోనుగుంట్ల కోటేశ్వరరావు

దివ్యాంగుల కళ్లలో ఆనందం చూడడమే ప్రథమ కర్తవ్యంగా చంద్రబాబు ప్రభుత్వం అడుగులు వేస్తోందని విభిన్న ప్రతిభావంతుల, వయోవృద్ధుల సహాయ సంస్థ మాజీ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన ఆధ్వర్యంలో చంద్రబాబు చిత్రపటానికి దివ్యాంగులు క్షీరాభిషేకం చేశారు. కొత్త ప్రభుత్వం ముందు ఆర్థిక సమస్యలు వున్నప్పటికీ సంక్షేమం కోసం ప్రభుత్వం ఏర్పడిన రోజు నుంచే దివ్యాంగులకు మంచి చేయాలని చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారని అన్నారు. కార్యక్రమంలో వెలుగుల శివ, గొలుసుల సాయి, నంబూరి శ్రీను, ఎస్. బ్రహ్మం, ఎన్. కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆనందమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే మాధవి, కమిషనర్ కీర్తి చేకూరి

గుంటూరు(కార్పొరేషన్) : పేదల ఆనందమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని, గత ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీని నెరవేర్చాలని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి తెలిపారు. సోమవారం కమిషనర్ కీర్తి చేకూరుతో కలిసి నగరపాలక సంస్థ పరిధిలోని పెన్షనర్లకు ఉదయం 6 గంటల నుండే వారి ఇంటి వద్దనే ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పెంచిన పింఛన్‌తోపాటు మూడు నెలల బకాయి పింఛన్‌ను అందజేశారన్నారు. కమిషనర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ సోమవారం సాయంత్రానికి పింఛన్ల పంపిణీ నూరు శాతం పూర్తికి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు గుంటూరు నగరంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీని వార్డ్ సచివాలయ కార్యదర్శుల ద్వారా పెన్షనర్ల ఇంటి వద్దనే అందిస్తున్నామన్నారు.కార్యక్రమంలో రాష్ట్ర క్రిస్టియన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఇమ్మానియేల్ మ్యాని, కార్పొరేటర్ వరప్రసాద్, డిప్యూటీ కమిషనర్లు సిహెచ్.శ్రీనివాస్, టి.వెంకటకృష్ణయ్య, వెంకట లక్ష్మీ, ఎంహెచ్‌వో మధుసూదన్, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, నోడల్ అధికారులు, సచివాలయం కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం

- గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్

ప్రజా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని తూర్పు ఎమ్మెల్యే మహ్మద్ నసీర్ అన్నారు. తూర్పు నియోజకవర్గం ఆనందపేటలో ఆయన కమిషనర్ కీర్తి చేకూరితో కలిసి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పెన్షన్ల పెంపు ద్వారా ముఖ్యమంత్రి ప్రతి ఇంటిలో పండగ వాతావరణం కల్పించారన్నారు. గతంలో రూ.2 వేలు, ప్రస్తుతం రూ.4 వేలకు పెంపు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేదల పక్షపాతిగా నిలిచారన్నారు. ఎన్నికల హామీ మేరకు ఏప్రిల్ నుండే పెంపు అమలు చేశారన్నారు. కమిషనర్ మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీకి ప్రత్యేక టీం ఏర్పాటు చేశామన్నారు. కేవలం సచివాలయ ఉద్యోగుల చేత పెన్షన్ పంపిణీ చేస్తున్నామన్నారు. ఎక్కడా అదనంగా సిబ్బంది నియమించలేదని తెలిపారు. కార్యక్రమంలో అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ జాగర్లమూడి శ్రీనివాసరావు , అర్బన్ పార్టీ అధ్యక్షులు డేగల ప్రభాకర్, కార్పొరేటర్లు, టిడిపి నాయకులు పాల్గొన్నాం


చంద్రబాబు చిత్రపటానికి కోవెలమూడి క్షీరాభిషేకం


పింఛను అందజేస్తున్న డేగల ప్రభాకర్


చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కనపర్తి

ఏఎన్‌యూ వీసీ రాజీనామా అందజేత

పెదకాకాని, జూలై 1: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పట్టేటి రాజశేఖర్ సోమవారం తన పదవికి రాజీనామా చేసి ఆలేఖను ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సంధ్యకోలేకు అందజేశారు. తనకు సహకారం అందించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

రెక్టర్ రాజీనామా.. రెక్టార్ ప్రొఫెసర్ పి. వరప్రసాద్ మూర్తి కూడా తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు సోమవారం ప్రకటించారు. ఈమేరకు తన రాజీనామా లేఖను ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సంధ్య కోలేకు అందజేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సంధ్య కోలే మాట్లాడుతూ వీసీ, రెక్టార్‌ల రాజీనామా లేఖలను ఉన్నత విద్య శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ పంపినట్లు పేర్కొన్నారు.

పదవుల నుంచి రిలీవ్ కోరిన అధికారులు..

విశ్వవిద్యాలయంలో పాలనాపరమైన పదవులు నుంచి తమను రిలీవ్ చేయాలని కోరుతూ వర్సిటీలోని డైరెక్టర్లు, కోఆర్డినేటర్‌లు మూకుమ్మడిగా తమ రిలీవింగ్ ఆర్డర్లను సోమవారం ఉదయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పీ.రాజశేఖర్‌కు అందజేశారు. రిలీవింగ్ కోరిన వారిలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బీ.కరుణ, దూరవిద్య కేంద్రం డైరెక్టర్ డాక్టర్ బట్టు నాగరాజు, సీడీఐ డీన్ ప్రొఫెసర్ కే.మధుబాబు, పీజీ పరీక్షల కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ ఉదయ్‌కుమార్, ఇంటర్నేషనల్ స్టూడెంట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ చెన్నారెడ్డి, దూర విద్యా కేంద్రం పరీక్షల కో-ఆర్డినేటర్ డాక్టర్ సోమశేఖర్, పేరోల్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ బి. సత్య నారాయణ, బాలుర వసతి గృహాల చీఫ్ వార్డెన్ ప్రొఫెసర్ జి. నాగరాజులు తమను రిలీవ్ చేయాలని కోరారు. వారి విన్నపాలను ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సంధ్యకోలేకు పంపినట్లు వీసీ తెలిపారు.

చెప్పామంటే ...చేస్తామంతే

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్రకుమార్

గుంటూరు సిటీ, జూలై 1 : కూటమి ప్రభుత్వం చెప్పామంటే.. చేస్తామంతే అనే పద్ధతిలో పనిచేస్తుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్రకుమార్ అన్నారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని 59వ సచివాలయం ఆర్ అగ్రహారం సాయిబాబా గుడి ఎదురు సందులో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పింఛన్ల పండుగ జరుపుకోవడం అందరికీ ఆనందంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో 18వ డివిజన్ అధ్యక్షుడు పుడతా నరసింహారావు, పెరుమాళ్ళ పద్మనాభం, జనసేన నేతలు ఉగ్గిరాల రాజా, రమణ, సచివాలయ సిబ్బంది వసంత రాజ్, కవిత, రాజ్యలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు : సీఎం చంద్రబాబు ప్రజలకు ఏదైనా చెప్పారంటే చేస్తారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తాడిశెట్టి మురళీ మోహన్ అన్నారు. సోమవారం ప్రత్తిపాడు నియోజక వర్గంలోని పొత్తూరు గ్రామంలో లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పెంచిన పెన్షన్‌లను స్వయంగా ఆయన చేతుల మీదుగా అందించారు. మురళీ మోహన్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ఒక్క ఏపీ లోనే 4 వేలు పెన్షన్ ఇస్తున్నారన్నారు. గత మూడు నెలలుతో కలిపి 7 వేలు ఇచ్చి టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి ఎప్పుడూ పెద్దపీట వేస్తుందనడానికి నిలువెత్తు నిదర్శనం ఇదేనన్నారు.

మార్కెట్లోకి ఏథెర్ రిస్తా ఎలక్ట్రిక్ స్కూటర్

గుంటూరు, జూలై 1: ఎలక్ట్రిక్ స్కూటర్ విపణిలో పనితీరులో, క్వాలిటీలోనూ వినియోగదారులను ఆకట్టుకున్న ఏథెర్ మరో ఎలక్ట్రిక్ స్కూటర్ రిస్తా ఫ్యామిలీ వాహనం మార్కెట్లో విడుదలైంది. గుంటూరు అమరావతి రోడ్డులోని పవన్ ఏథెర్ షోరూంలో ఏథెర్ రిస్తా వాహనాన్ని సోమవారం లాంఛనంగా విడుదల చేశారు. ఏథెర్ కంపెనీ ఏరియా సేల్స్ మేనేజర్ పునీత్‌కుమార్ మొదటి వినియోగదారునకు వాహనాన్ని అందజేశారు. షోరూం ఎండీ చుక్కపల్లి శ్రీకాంత్ మాట్లా డుతూ రిస్తా ప్రారంభధర రూ.109841 ఉంటుందన్నారు. మార్కెట్లో అన్ని స్కూటర్ల కన్నా పొడవాటి 900ఎమ్ఎమ్ సీట్ కలిగి ఉంటుం దన్నారు. ఈ వాహనం 160 కేఎమ్ సర్టిఫైడ్ రేంజ్ దూరం ప్రయాణి స్తుందని, బ్యాటరీ 3.7 కిలోవాట్ కెపాసిటీతో వాటర్ మరింత డస్ట్ ప్రూఫ్‌తో ఫ్రంట్ డిస్క్ బ్రేక్‌తో ఎల్ఈడీ పొజిషన్ ల్యాంప్, రివర్స్ మోడ్, సీట్ కింద 34 లీటర్ల స్టోరేజ్ కెపాసిటీతో ఉంటుందన్నారు. మూడేళ్ళ బ్యాటరీ వారంటీ సదుపాయంతో ఏడు రంగుల్లో లభిస్తుందన్నారు. ముందస్తు బుకింగ్ ద్వారా వినియోగదారులు తక్కువ వ్యవధిలో డెలివరీ పొందవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో షోరూం మేనేజర్ అనూష, షోరూం సిబ్బంది ఉన్నారు.


స్కూటర్‌ను విడుదల చేస్తున్న పునీత్‌కుమార్, ఎండీ శ్రీకాంత్

చిన్నారి విద్యార్థుల్లో స్ఫూర్తి నింపిన శ్రేష్ట హాస్పిటల్

● జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా వినూత్న కార్యక్రమం

గుంటూరు (మెడికల్) జూలై 1: గుజ్జనగుళ్ల సెంటర్‌లోని శ్రేష్ట హాస్పిటల్స్‌లో సోమవారం వినూత్నంగా జాతీయ వైద్యుల దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. నెక్స్ట్ జెన్ స్కూల్‌కు చెందిన మూడు నుంచి ఐదవ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు శ్రేష్ఠ హాస్పిటల్స్‌కు ఆహ్వానించారు. చిన్నారి విద్యార్థుల్లో సైన్స్, వైద్య రంగం పట్ల ఆసక్తికి కలిగించేందుకు, ఉన్నత విద్య పట్ల వారిలో స్ఫూర్తిని నింపేందుకు ఈ కార్యక్రమం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో వచ్చిన విద్యార్థులకు వైద్యులకు, వైద్య సిబ్బందికి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా సమాజంలో వైద్య రంగం ప్రాముఖ్యత, వైద్యుల సేవల తీరును ఉపాధ్యాయులు చిన్నారులకు వివరించారు. నిరంతరం రోగుల సేవలో తలమునకలై ఉండే వైద్యులకు కొంత సమయం పిల్లలతో గడపటం ఆనందం కలిగించింది. తాము అందిచే వైద్య సేవలను వారు పిల్లలకు సరళమైన భాషలో వివరించారు. ఈ సందర్భంగా శ్రేష్ఠ హాస్పిటల్ చైర్మన్, సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ వై లక్ష్మణ స్వామి మాటాలడుతూ జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా చిన్నారి విద్యార్థులకు తమ ఆసుపత్రి సందర్శన వల్ల వారిలో చాల మంది భవిష్యత్తులో వైద్యులుగా ఎదిగేందుకు తగిన స్ఫూర్తిని నింపుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.


డాక్టర్‌తో కరచాలనం చేస్తున్న విద్యార్థులు



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మీ, జేసీ రాజకుమారి తదితరులు

అర్జీల పరిష్కారంపై అలసత్వం వద్దు..

● కలెక్టర్ ఎస్. నాగలక్ష్మీ ● ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 142 అర్జీలు
● పరిష్కరించాలంటూ ఆదేశాలు

గుంటూరు(తూర్పు), జూలై1: అర్జీల పరిష్కారం పట్ల అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటానని అధికారులను కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ హెచ్చరించారు. సోమవారం కలక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. కార్యక్రమానికి 142 అర్జీలు వచ్చాయి. జేసీ రాజకుమారి, డిఆర్వో పెద్ది రోజా, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం.గంగరాజు, ఆర్డీవో పీ.శ్రీకర్‌తో కలసి ఆమె అర్జీలను స్వీకరించారు. అనంతరం కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన అర్జీలను నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో హౌసింగ్ పీ డీ వేణు గోపాల్, సీపీవో శేషశ్రీ, సాంఘీక సంక్షేమ శాఖ డీడీ మధుసూదనరావు, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్ వెంకటేశ్వర్లు, డీఎస్‌వో కోమలి పద్మ, గిఈవో శైలజ తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పక్షవాతం వచ్చిన వ్యక్తికి వైకల్యం లేదని సర్టిఫికెట్ ఇచ్చారు..

ఏడు సంవత్సరాల క్రితం పక్షవాతం భారీన పడి పూర్తిగా మంచానికే పరిమితం అయ్యాడని, కానీ శారీరక వైకల్యం సున్నా అని చెప్పి పొన్నూరు వైద్య సిబ్బంది సర్టిఫికెట్ ఇచ్చారని చేబ్రోలు మండలం, శ్రీరంగపురంకు చెందిన తిరుమలశెట్టి వెంకటరమణ అర్జీ అందజేశారు. భర్త తిరుమల శెట్టి శ్రీనివాసరావుతో కలిసి జిల్లా కలెక్టర్‌కు కలిసి తన వేదనను చెప్పుకుంది. పీ హెచ్ సీ, సచియాలయాలకు చుట్టూ తిరుగుతున్నా సర్టిఫికె ట్‌లో మార్పు చేయలేదని ఆవేదన వ్యక్తంచేశారు. దీంతో పెన్షన్ రావడంలేదని వాపోయారు. జిల్లా వైద్యాధికారులు స్పందించి వైకల్యం శాతాన్ని బట్టి సర్టిఫికెట్ జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

టౌన్ ప్లానింగ్ అధికారిపై చర్యలు తీసుకోవాలి

గుంటూరు టౌన్ ప్లానింగ్ అధికారి నాగవల్లి అక్రమ నిర్మాణాలకు అండగా నిలుస్తూ అక్రమాలు పాల్పడుతున్నారంటూ వసంతరాయపురానికి చెందిన నాగుల్ మీరా ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీ అందజేశారు. ఇన్నర్ రింగ్ రోడ్‌లోని రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద జీ ప్లస్ 3 భవనానికి అనుమతి ఉన్నచోట జీ ప్లస్ 4 భవనం నిర్మిస్తున్న వారి వద్ద నుంచి పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేస్తుందని, నగరపాల సంస్థ కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

రీ సర్వే పేరుతో ఖాతా నెంబర్లను మార్చారు....

జగనన్న రీ సర్వే పేరుతో రెవెన్యూ అధికారులు ఖాతా నెంబర్లు మార్చారని దుగ్గిరాల మండలం, చింతలపూడి గ్రామానికి చెందిన దానబోయిన శివాజీ యాదవ్ అర్జీ అందజేశారు. గ్రామంలో సర్వే నెంబరు 471/బి, ఖాతా నెంబరు- 82లో 27సెంట్ల వ్యవసాయ భూమి ఉందని, 40 ఏళ్ల నుంచి సాగు చేసుకుంటున్నానని, ఈ మధ్యనే వచ్చిన జగనన్నసర్వేలో ఖాతా నెంబరు-1262కు మార్చి రికార్డులను తారుమారు చేశారని వినతిపత్రంలో పేర్కొన్నారు. దీనిపై గతంలో ఐదు సార్లు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన ఫలితం లేకుండా పోయిందని వాపోయారు.

పొలాన్ని ఆన్‌లైన్లో ఎక్కించడం లేదు

ఎకరంలో ఉన్న 80 సెంట్లును ఆన్‌లైన్‌లో ఎక్కించారని, మిగిలిన 20 సెంట్లు పొలాన్ని ఎక్కించకుండా అధికారులు వేధిస్తున్నారని ఫిరంగిపురం మండలం, తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన బద్దులూరి సత్యనారాయణ అర్జీ అందజేశారు. రీసర్వే పేరుతో 20 సెంట్లు పొలాన్ని వేరేవారి భూమిలో కలిపారని, దీనిపై ఉన్నాతాధికారులను కలిసి సమస్యను పరిష్కరించుకున్నామని, కానీ 20 సెంట్లు మాత్రం ఆన్‌లైన్ రికార్డులో ఎక్కించడంలేదని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.

వైసీపీ నేతనంటూ భూమిని ఆక్రమించుకున్నాడు

భూమిని అక్రమించుకుని, తనపై దాడి చేసాడని, అదేమని అడిగితే వైసీపీ నాయకుడనని బెదిరిస్తున్నాడని విశ్రాంత ఆర్మీ ఉద్యోగి శివనాథం సాయిబాబు అర్జీ అందజేశారు. 1983లో కాకానీ మండలం, తక్కెళ్లపాడు గ్రామంలో వృద్ధ ఆశ్రమాన్ని నెలకోల్పాలనే ఉద్దేశ్యంతో సర్వే నెంబరు 1లో 24 సెంట్లు భూమిని కొనుగోలు చేసానని వివరించారు. గత నెల 8న స్థలంలో మామిడి మొక్కలు నాటడానికి వెళితే అక్కడ ఉన్న స్థానిక వైసీపీ నాయకుడు పవన్ అనే వ్యక్తి తనపై తీవ్రంగా దాడి చేసాడని వినతిపత్రంలో పేర్కోన్నారు. దీనిపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయాడు. ప్రాణ రక్షణ కల్పించడంతో పాటు తన భూమిని ఇప్పించాలని కోరారు.

ఒకే సర్వే నెంబరు ఇద్దరికి కేటాయించారు..

స్థానిక రెవెన్యూ అధికారులు ఒకే సర్వే నెంబరు కేటాయించారని దీంతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నానని పెదనందిపాడు మండలం, అబ్బినేని గుంటవారిపాలెంకు చెందని మక్తాం సాహెబ్ అర్జీ అందజేశారు. మా కుటుంబానికి సర్వే నెంబరు 428లో 68సెంట్ల భూమి ఉందన్నారు. కానీ కొంతమంది అధికారులు సర్వే నెంబరులో ఇద్దరూ పేర్లు చేర్చారని, దీనిపై లోకాయిక్తాలో ఫిర్యాదుచేస్తే మాకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని తెలిపారు. కానీ అధికారులు మాత్రం రికార్డుల్లో పేరు మార్చడం లేదని వాపోయాడు, దీనిపై ఏడు సంవత్సరాల నుంచి తిరుగుతున్నా ఫలితం లేకుండా పోయిందని వినతిపత్రంలో పేర్కోన్నారు.

ఎస్పీ కార్యాలయానికి పలువురి ఫిర్యాదులు

గుంటూరు, జూలై 1: పలు సమస్యలతో జిల్లా వ్యాప్తంగా పలువురు సోమవారం ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించారు. తాను బతికి ఉండగానే చనిపోయినట్లు డెత్ సర్టిఫికెట్ సృష్టించి దాని ద్వారా తన ఆస్తిని తన భర్త వేరొకరికి రిజిస్ట్రేషన్ చేశాడని కొరిటెపాడు రెండవ లైన్ కి చెందిన కొండ్రు వెంకటరత్నం అలియాస్ రోజా ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.

ఇదిలా ఉంటే వెంకటరత్నం భర్త ఏసు రాజు, ఆయన కుమారుడు కూడా సోమవారం ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించారు. తమ వాటా స్థలాన్ని మాత్రమే తాను వేరొకరికి జీపీఏ రిజిస్ట్రేషన్ చేశానని తెలిపారు.

తనను ఇజ్రాయిల్ పంపిస్తామని తన నుంచి మూడు లక్షల 50 వేలు డబ్బులు తీసుకొని కన్సల్టెన్సీ నిర్వాహకులు మోసం చేశారని, నగరంలోని గుజ్జనగుండ్లకు చెందిన కంబాల సురేష్ ఎస్పీకి ఫిర్యాదు చేశాడు.

సిమెంట్ ఫ్యాక్టరీలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి తమ వద్ద డబ్బులు తీసుకొని ఉయ్యూరు కు చెందిన పెమ్మా నరేష్ తమను మోసం చేశాడని ఆడగ్రహారంకు చెందిన కావటి గోపీ శ్రీనివాసరావు, నల్లచెరువు ఆరో లైనుకు చెందిన మండా గోపి ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.

తనకు పిత్రార్జితం ద్వారా వచ్చిన ఇంటిని విక్రయించగా వచ్చిన 16 లక్షలతో మరో ఇల్లు కొనుగోలు చేసేందుకు ప్రయత్నిస్తుండగా తన స్నేహితుడైన ఆటో డ్రైవర్ కారుమూరి కృష్ణారెడ్డి తాను నీ ఇల్లు కొనిపిస్తానని చెప్పి తన నుంచి రూ.14 లక్షలు తీసుకుని తనను మోసంచేసాడని ఆర్ అగ్రహారం చెందిన ఉడత శ్రీనివాసరావు ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు.

మనవరాలిపై కామోన్మాది కన్ను

● తల్లిదండ్రులకు చెప్పడంతో ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు

గుంటూరు, జులై 1 : చిలకలూరిపేట రోడ్డులోని మిర్చియార్డ్ సమీప కాలనీకి చెందిన ఓ వ్యక్తికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన రెండో కుమార్తె (13 సంవత్సరాలు) మున్సిపల్ స్కూల్లో చదువుతోంది. ఆయన తండ్రి పక్కనే ఉండే ఇంటిలో నివాసం ఉంటాడు. అతనిని భార్య వదలేసి వెళ్లి పోయింది. లారీ డ్రైవర్‌గా చేస్తూ కర్ణాటకకు చెందిన ఓ మహిళను తీసుకొచ్చి ఆమెతో సహజీవనం చేస్తున్నాడు. ఈ క్రమంలో కొద్ది నెలలుగా తన మనవరాలిపై అతని కన్నుపడింది. తనతో ఉండే మహిళ తో కలిసి ఆ బాలికతో అసభ్యకరంగా ప్రవర్తిస్తూ వచ్చాడు. ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించాడు. ఇలా జరుగుతుండగా ఇటీవల ఒక రోజు ఆ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక కేకలు వేసేందుకు ప్రయత్నించగా అతడితో ఉండ మహిళ బాలిక నోరు మూసింది. దీంతో భయపడిన బాలిక వారిరువురి నుంచి తప్పించుకుని గడియ తీసుకొని బయటకు పరుగు పెట్టింది. జరిగిన విషయాన్ని తల్లికి చెప్పింది. సొంత తాత అయిన వృద్ధుడు బాలికతో ప్రవర్తించిన తీరుతో ఆ తల్లిదండ్రులు నిర్ఘాంతపోయారు. సోమవారం తల్లిదండ్రులు బాలికతో కలసి పోలీస్ కార్యాలయానికి వచ్చి ఆ వృద్ధ కామాంధుడిపై పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

ఐఐఎఫ్‌టీలో సర్టిఫికెట్ కోర్సు

ఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(ఐఐఎఫ్‌టీ)-'సర్టిఫికెట్ ప్రోగ్రామ్ ఇన్ ఎక్స్‌పోర్ట్ ఇంపోర్ట్ మేనేజ్‌మెంట్'లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. దీని వ్యవధి నాలుగు నెలలు. ఈ ప్రోగ్రామ్‌ను ఆఫ్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు. ప్రోగ్రామ్‌లో భాగంగా క్లాస్ రూమ్ తరగతులు, ఆన్‌లైన్ అసెస్‌మెంట్, అసైన్‌మెంట్, ప్రజంటేషన్, ప్రాజెక్ట్ వర్క్‌లు, కేస్ స్టడీస్, క్విజ్ ప్రోగ్రామ్‌లు, ఇంటర్నల్&ఫైనల్ ఎగ్జామినేషన్స్ ఉంటాయి. లెర్నింగ్ వెబ్ పోర్టల్‌కు లైఫ్ టైమ్ యాక్సెస్, కోర్సు మెటీరియల్ ఇస్తారు. ఇండస్ట్రీ లీడర్స్, మిడిల్ లెవెల్ ఎగ్జిక్యూటివ్‌లు, ఆంత్రప్రెన్యూర్స్, ఫ్రెషర్స్‌కు ఈ ప్రోగ్రామ్ ఉపయోగకరంగా ఉంటుంది.

కోర్సు వివరాలు

- వారాంతాల్లో ఉదయం తొమ్మిదిన్నర నుంచి సాయంత్రం అయిదు వరకు క్యాంపస్‌లో తరగతులు నిర్వహిస్తారు. కనీసం 75 శాతం అటెండెన్స్ తప్పనిసరి.
- ఇంటర్నేషనల్ మార్కెటింగ్ మేనేజ్‌మెంట్ 20 గంటలు, ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆపరేషన్స్ అండ్ ఎక్స్‌పోర్ట్ ఇంపోర్ట్ డాక్యుమెంటేషన్ 30 గంటలు, ఇండియాస్ ఫారిన్ ట్రేడ్ పాలసీ 20 గంటలు, ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫైనాన్స్ 30 గంటలు, కస్టమ్ రెగ్యులేషన్స్ అండ్ ఇంపోర్ట్ ప్రొసీజర్స్ ఆఫ్ ఇండియా 20 గంటలు, ఇంటర్నేషనల్ ట్రేడ్ లాజిస్టిక్స్ 30 గంటలు తరగతులు నిర్వహిస్తారు. ఇంటర్నల్, ఫైనల్ ఎగ్జామ్స్‌ను ఆన్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు. కనీసం 50 శాతం మార్కులు వస్తేనే సర్టిఫికెట్ ఇస్తారు.

అర్హత

- గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఏదేని డిగ్రీ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 20
- **వెబ్‌సైట్:** iift.ac.in



జేఎన్‌టీయూఏలో ఇంటర్నేషనల్ కొలాబరేటివ్ ప్రోగ్రామ్

అనంతపురంలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూఏ), స్వీడన్‌లోని బ్లీకింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(బీటీహెచ్) ఉమ్మడిగా నిర్వహిస్తున్న ఇంటర్నేషనల్ కొలాబరేటివ్ ప్రోగ్రామ్ (బీటెక్&బీఎస్+ఎంఎస్)లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైంది. ప్రోగ్రామ్ వ్యవధి ఆరేళ్లు. మొదటి మూడేళ్లు జేఎన్‌టీయూఏ-కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో, చివరి మూడేళ్లు బీటీహెచ్‌లో చదవాల్సి ఉంటుంది. నాలుగో ఏడాది అంటే బీటీహెచ్‌లో ఒక సంవత్సరం చదివిన తరవాత ప్రోగ్రామ్‌నుంచి వైదొలగే వీలుంది. వీరికి జేఎన్‌టీయూఏ నుంచి బీటెక్ డిగ్రీ, బీటీహెచ్ నుంచి బీఎస్ డిగ్రీ లభిస్తాయి. మిగిలిన రెండేళ్ల ప్రోగ్రామ్ పూర్తిచేసినవారికి బీటీహెచ్ నుంచి ఎంఎస్ డిగ్రీ లభిస్తుంది. సీఎస్ఈ విభాగంలో 20 సీట్లు, ఈసీఈ విభాగంలో 10 సీట్లు ఉన్నాయి. జేఈఈ మెయిన్ 2024 ర్యాంక్ ద్వారా 50 శాతం సీట్లను; ఏపీ ఈఏపీసెట్ 2024/టీజీ ఈఏపీసెట్ 2024 స్కోర్ ద్వారా మిగిలిన 50 శాతం సీట్లను భర్తీ చేస్తారు. ఈ ప్రోగ్రామ్‌నకు సంబంధించిన అవేర్‌నెస్ సెషన్‌ను జూలై 20న సాయంత్రం నాలుగు గంటలకు నిర్వహిస్తారు. స్వీడన్‌లో ఎంఎస్ ప్రోగ్రామ్ పూర్తిచేసిన అభ్యర్థులు అక్కడే మరో ఏడాది రెసిడెన్స్ పర్మిట్ పొందవచ్చు. క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ఉన్నాయి.

ప్రోగ్రామ్ స్పెషలైజేషన్‌లు

- జేఎన్‌టీయూఏ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో మొదటి మూడేళ్లు బీటెక్(కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్), బీటీహెచ్‌లో నాలుగో ఏడాది బీఎస్(కంప్యూటర్ సైన్స్/ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్) చదవాల్సి ఉంటుంది.
- బీటీహెచ్‌లో చివరి రెండేళ్ల ఎంఎస్ ప్రోగ్రామ్‌లో సీఎస్ఈ అభ్యర్థులకు కంప్యూటర్ సైన్స్, సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ స్పెషలైజేషన్‌లు; ఈసీఈ అభ్యర్థులకు మెషిన్ లెర్నింగ్-సెన్సర్స్ అండ్ సిస్టమ్స్ స్పెషలైజేషన్ ఉంటాయి.

అర్హత

- బీఐఈ(ఏపీ)/సీబీఎస్ఈ/ఐసీఎస్ఈ నుంచి మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 70 శాతం మార్కులు తప్పనిసరి. జేఈఈ మెయిన్ 2024/ఏపీ ఈఏపీసెట్ 2024/టీజీ ఈఏపీసెట్ 2024 స్కోర్ ఉండాలి. ఆంగ్ల మాధ్యమంలో చదవని అభ్యర్థులకు ఐఈఎల్‌టీఎస్/టోఫెల్ స్కోర్ ఉండాలి. ఐఈఎల్‌టీఎస్‌లో ప్రతి సెక్షన్‌లో కనీసం 5.5, మొత్తమ్మీద కనీసం 6.5 స్కోర్; టోఫెల్‌లో అయితే 575/90 స్కోర్ ఉండాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.1500
- **పోస్ట్ ద్వారా దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** జూలై 25
- పూర్తిచేసిన దరఖాస్తును కింది ఈ-మెయిల్‌కు అప్‌లోడ్ చేయాలి.
- **అడ్మిషన్ కౌన్సెలింగ్:** జూలై 29న
- **కౌన్సెలింగ్ వేదిక:** డైరెక్టర్ ఆఫ్ ఫారిన్ అఫైర్స్ అండ్ అలూమ్నీ మ్యాటర్స్ కార్యాలయం, జేఎన్‌టీయూఏ, అనంతపురం.
- **దరఖాస్తు పంపాల్సిన చిరునామా:** రిజిస్ట్రార్, జేఎన్‌టీయూఏ, అనంతపురం, ఆంధ్రప్రదేశ్-515002
- **ఈ-మెయిల్:** indiarelations@bth.se, dfaam@jntua.ac.in
- **వెబ్‌సైట్:** www.jntua.ac.in

దిక్సూచి DIKSUCHI

ఐఐటీ మద్రాస్‌లో ఎంబీఏ- డిజిటల్ మారిటైమ్ అండ్ సప్లయ్ చైన్

మద్రాస్‌లోని ద ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ) ప్రపంచంలోనే తొలిసారిగా వినూత్నమైన కోర్సు 'డిజిటల్ మారిటైమ్ అండ్ సప్లయ్ చైన్'ని అందుబాటులోకి తెచ్చింది. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న సముద్ర వాణిజ్యం, సరఫరా వ్యవస్థ యాజమాన్య పద్ధతుల్లో ఎదురయ్యే సంక్లిష్టతలను అధిగమించేందుకు అవసరమైన ఆధునిక నైపుణ్యాలను ఈ కోర్సు ద్వారా పెంపొందించుకోవచ్చు. రెండేళ్ల వ్యవధి గల ఈ కోర్సును ఐఐటీ మద్రాస్‌కి చెందిన డిపార్ట్‌మెంట్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్, ఓషన్ ఇంజనీరింగ్ రూపొందించాయి. తొలి బ్యాచ్ 2024 సెప్టెంబరులో ప్రారంభం కాబోతుంది.

- **ఎంబీఏ ఇన్ డిజిటల్ మారిటైమ్ అండ్ సప్లయ్ చైన్**

వ్యవధి: రెండేళ్లు.

ప్రోగ్రామ్ వివరాలు: ఐఓటీ, ఏఐ, ఎంఎల్, బ్లాక్ చెయిన్ వంటి డిజిటల్ టెక్నాలజీపై నైపుణ్యాలు సాధిస్తారు. 900 గంటలు క్లాస్ రూమ్ సెషన్స్, ప్రాజెక్ట్ వర్క్ ఉంటాయి. కోర్సుకి మొత్తం 192 క్రెడిట్స్ నిర్దేశించారు. వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కి ఆన్‌లైన్, ఆన్ క్యాంపస్ మాడ్యుల్స్ అందుబాటులో ఉన్నాయి. గ్రాడ్యుయేషన్ పూర్తి అయిన తరవాత ఐఐటీ మద్రాస్ అలూమ్నీ స్టేటస్ కూడా లభిస్తుంది. అదేవిధంగా ఐఐటీ మద్రాస్ ఇన్‌క్యుబేషన్ అండ్ స్టార్టప్ ప్లాట్‌ఫాం ద్వారా ఉద్యోగవకాశాలు పొందే సౌలభ్యం కూడా ఉంది.

అర్హత: అభ్యర్థులు కనీసం 60 శాతం మార్కులతో బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. రెండేళ్ల పూర్తి స్థాయి(ఫుల్ టైం) పని అనుభవం ఉండాలి.

ఎంపిక విధానం: వచ్చిన దరఖాస్తులను పరిశీలించి షార్ట్‌లిస్ట్ చేస్తారు. షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు ఆన్‌లైన్ అడ్మిషన్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు.

కోర్సు ఫీజు: రూ.9,00,000. వాయిదాల పద్ధతిలో చెల్లించవచ్చు. అర్హులైన వారికి బ్యాంక్ రుణ సదుపాయం కూడా ఉంటుంది.

వెబ్‌సైట్: https://www.iitm.ac.in/



జాబ్ కార్నర్

హిందుస్థాన్ కాపర్‌లో జూనియర్ మేనేజర్లు

కోల్‌కతాలోని హిందుస్థాన్ కాపర్ లిమిటెడ్...వివిధ విభాగాల్లో కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: జూనియర్ మేనేజర్

ఖాళీలు: 56

విభాగాలు: మైనింగ్, ఎలక్ట్రికల్, కంపెనీ సెక్రటరీ, ఫైనాన్స్, హెచ్ఆర్

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, బ్యాచిలర్ డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్, పీజీ డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

గరిష్ఠ వయోపరిమితి: 2024 జూన్ 1 నాటికి 40 సంవత్సరాలు మించకూడదు

పే స్కేల్: నెలకు రూ.30,000- రూ.1,20,000

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, ధ్రువపత్రాల పరిశీలన తదితరాల ఆధారంగా.

దరఖాస్తు ఫీజు: రూ.500

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూలై 21

వెబ్‌సైట్: https://www.hindustancopper.com/

ఎన్‌ఎఫ్ఎస్‌సీలో బీటెక్(ఫైర్ ఇంజనీరింగ్)

నాగ్‌పూర్‌లోని నేషనల్ ఫైర్ సర్వీస్ కాలేజ్(ఎన్ ఎఫ్ఎస్‌సీ)- బీటెక్(ఫైర్ ఇంజనీరింగ్) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. మొత్తం 60 సీట్లు ఉన్నాయి. జేఈఈ మెయిన్ 2024 ర్యాంక్, డాక్యుమెంట్స్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్‌ల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ/బయోటెక్నాలజీ/బయాలజీ/టెక్నికల్ ఒకేషనల్ సబ్జెక్టులతో ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 50 శాతం మార్కులు తప్పనిసరి. జేఈఈ మెయిన్ 2024లో అర్హత స్కోర్ ఉండాలి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 2
- **దరఖాస్తుల పరిశీలన:** జూలై 4న
- **అభ్యర్థులకు కాల్ లెటర్స్ పంపిణీ:** జూలై 5న
- **అడ్మిషన్స్ తేదీ:** జూలై 29
- **వెబ్‌సైట్:** https://nfscbtechadmissions. com/

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/YFfr14Xలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి



మాస్ మూమెంట్స్‌తో 'స్టెప్పామార్'

రామ్ పోతినేని ప్రస్తుతం పూరి జగన్నాథ్ దర్శకత్వంలో పాన్ ఇండియా సినిమాగా తెరకెక్కుతోన్న 'డబుల్ ఇస్మార్ట్'లో నటిస్తున్నారు. ఇది 2019లో విడుదలై బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్‌ను అందుకున్న 'ఇస్మార్ట్ శంకర్'కు సీక్వెల్. ఈ సినిమాలో హీరోయిన్‌గా కావ్య థాపర్ నటిస్తున్నారు. బాలీవుడ్ నటుడు సంజయ్‌దత్, అలీ, గెటప్ శ్రీను కీలక పాత్రలు పోషిస్తున్నారు. పూరి కనెక్ట్ బ్యానర్‌పై పూరి జగన్నాథ్, చార్మి కౌర్ సినిమాను నిర్మిస్తున్నారు. సినిమా ఆగస్టు 15న విడుదలవుతోంది. ఇటీవలే విడుదలైన ఈ సినిమా టీజర్ అందరికీ మంచి కిక్ ఇచ్చి.. సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది. సోమవారం ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్‌ను 'మాస్ సాంగ్ ఆఫ్ ది ఇయర్' అంటూ మేకర్స్ విడుదల చేశారు. 'స్టెప్పామార్' అంటూ సాగే ఈ పాట హై ఎనర్జిటిక్ మాస్ మూమెంట్స్‌తో సాగింది. ఈ పాటకు భాస్కరభట్ల సాహిత్యం అందించగా, అనురాగ్ కులకర్ణి, సాహితీ ఆలపించారు. జానీ మాస్టర్ కొరియోగ్రఫీ అందించిన ఈ సాంగ్‌కు మణిశర్మ సంగీతం అందించారు.

సూపర్ నేచురల్ థ్రిల్లర్

వైవిధ్యమైన చిత్రాలతో అందరినీ ఆకట్టుకొంటున్న సుధీర్‌బాబు ఓ సూపర్ నేచురల్ మిస్టరీ థ్రిల్లర్‌లో నటించనున్నారు. మన పురాణాలతో అనుసంధానం చేస్తూ ఎన్నో రహస్యాలను వెలికి తీసే కథతో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మించనున్నారు. ఇంతకుముందెన్నడూ రాని డిఫరెంట్ కాన్సెప్ట్‌తో విజువల్ ఎఫెక్ట్స్‌కు ఎంతో ప్రాధాన్యం ఇస్తూ రూపుదిద్దుకొనే ఈ చిత్రానికి వెంట్ కల్యాణ్ దర్శకుడు. 'రుస్తమ్', 'టాయిలెట్', 'ఏక్ ప్రేమ్ కథ', 'ప్యాడ్‌మ్యాన్', 'పరి' వంటి విజయవంతమైన చిత్రాలను అందించిన ప్రేరణ అరోరా సమర్పణలో ఈ సినిమా రూపుదిద్దుకుంటుంది. ఇందులో సుధీర్ బాబు సరసన బాలీవుడ్ కథానాయిక నటిస్తుంది. ఆమె ఎవరనేది త్వరలో తెలియజేస్తామని దర్శకనిర్మాతలు చెప్పారు. 'కుట్ర, పన్నాగాలతో మంచికి, చెడుకీ మధ్య జరిగే యుద్ధం ఈ చిత్ర ముఖ్యాంశం. పాన్ ఇండియా సినిమాల్లో ఓ మైల్ స్టోన్‌గా ఉంటుంది' అని చెప్పారు దర్శకుడు కల్యాణ్. ఈ సినిమా గురించి సుధీర్‌బాబు మాట్లాడుతూ 'ఈ స్క్రిప్ట్ నచ్చి ఏడాది నుంచి ఈ టీమ్‌తో ట్రావెల్ అవుతున్నాను. డిఫరెంట్ కంటెంట్‌తో రూపొందనున్న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు ఎప్పుడు వస్తుందా అని ఆతృతతో ఎదురుచూస్తున్నాను' అని చెప్పారు. ఆగస్టు 15న ఫస్ట్‌లుక్ విడుదల చేస్తామనీ, సినిమాను శివరాత్రి సందర్భంగా వచ్చే ఏడాది మార్చిలో విడుదల చేస్తామనీ ప్రేరణ అరోరా చెప్పారు.



మిస్ యూనివర్స్‌తో 'క్యాలెండర్' సాంగ్



కమల్ హాసన్ నటిస్తున్న భారీ బడ్జెట్ చిత్రం 'భారతీయుడు 2'. ఇది 1996లో రిలీజై బాక్సాఫీస్ వద్ద సంచలన విజయం సాధించిన 'భారతీయుడు' చిత్రానికి సీక్వెల్. టాప్ డైరెక్టర్ శంకర్ దర్శకత్వం వహిస్తుండగా, సుభాస్కరన్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో కాజల్ అగర్వాల్, రకుల్‌ప్రీత్ సింగ్, సిద్ధార్థ్, ఎస్.జె.సూర్య, బాబీ సింహా తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ పాన్ ఇండియన్ మూవీ 12న విడుదలవుతోంది. ఇప్పటికే విడుదలైన పాటలు, టీజర్, ట్రైలర్ సినిమాపై అంచనాలను పెంచేశాయి. సోమవారం ఈ సినిమా నుంచి 'క్యాలెండర్' లిరికల్ వీడియోను మేకర్స్ విడుదల చేశారు. ఇందులో దక్షిణాఫ్రికాకు చెందిన మోడల్, 2017 మిస్ యూనివర్స్ డెమి లీ టెబో నటించి.. పాటకే ప్రత్యేకార్షణగా నిలిచారు. ఈ పాటకు చంద్రబోస్ సాహిత్యం అందించగా, శ్రావణ భార్గవి ఆలపించారు. అనిరుధ్ రవిచంద్రన్ సంగీతం అందించారు.

'కోడి బుర్ర' కథ ఏమిటి?



తమిళ హీరో శ్రీరామ్ కొత్త చిత్రం 'కోడి బుర్ర' షూటింగ్ సోమవారం ఉదయం హైదరాబాద్‌లో మొదలైంది. శ్రుతి మీనన్, ఆరుషి హీరోయిన్లుగా నటిస్తున్నారు. శాసనసభ్యుడు మల్‌రెడ్డి రంగారెడ్డి కెమెరా స్విచ్ ఆన్ చేసిన అనంతరం నిర్మాత బెక్కం వేణుగోపాల్ తొలి క్లాప్ ఇచ్చి షూటింగ్ ప్రారంభించారు. అనంతరం దర్శకుడు చంద్రశేఖర్ కానూరి మాట్లాడుతూ 'ఈ సినిమాలో శ్రీరామ్ పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తున్నారు. హీరోయిన్ శ్రుతి మీనన్ డాక్టర్‌గా నటిస్తోంది. క్రైమ్ థ్రిల్లర్ కథాంశంతో చిత్రం రూపుదిద్దుకుంటుంది' అని చెప్పారు. ఒక ఇంట్రెస్టింగ్ మూవీలో నటిస్తున్నందుకు ఆనందంగా ఉందని శ్రీరామ్ చెప్పారు.

యానిమేషన్ చిత్రానికి డాలర్ల పంట



యానిమేషన్ చిత్రం 'ఇన్‌సైడ్ అవుట్ 2' ప్రపంచవ్యాప్తంగా దుమ్ముదులుపుతోంది. చరిత్రలో ఇప్పటివరకూ ఏ యానిమేషన్ చిత్రం సాధించని అరుదైన ఫీట్‌ను నమోదు చేసింది. కేవలం మూడు వారాల్లోనే గ్లోబల్ బాక్సాఫీస్ వద్ద వన్ బిలియన్ డాలర్లు (దాదాపు రూ.8500 కోట్లు) ఆర్జించింది. ఇటువంటి సంచలన రికార్డు సాధించడమే కాకుండా ఈ ఏడాది ఇప్పటివరకూ రిలీజైన అన్ని సినిమాల కలెక్షన్లను వెనక్కునెట్టి అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. మొత్తానికి వన్ బిలియన్ డాలర్లు కొల్లగొట్టిన 11వ యానిమేషన్ సినిమాగా 'ఇన్‌సైడ్ అవుట్ 2' చరిత్ర సృష్టించింది. ఇండియాలోనూ రిలీజైన ఈ చిత్రం ఇప్పటికే రూ.100 కోట్ల పైచిలుకు కలెక్షన్లను సాధించడం విశేషం. 2015లో ఈ సినిమా మొదటి భాగం 'ఇన్‌సైడ్ అవుట్' జూన్ 19న విడుదలైంది. ఈ చిత్రానికి పీట్ డాక్టర్ దర్శకత్వం వహించారు. 11 ఏళ్ల రిలే అండర్సన్ అనే బాలిక మెదడులోని భావోద్వేగాలైన ఆనందం, కోపం, చిరాకు, బాధ, భయం యానిమేషన్ రూపు సంపాదించుకుని.. ఆమె ఆలోచనల్నీ, నిర్ణయాల్నీ ఎలా ప్రభావితం చేస్తాయి అనేది ఈ సినిమా కథ. ఈ సినిమా లైఫ్‌టైమ్ కలెక్షన్స్ దాదాపు 900 మిలియన్ డాలర్లు (రూ.7500 కోట్లు). ఈ సినిమాకు సీక్వెల్‌గా తెరకెక్కింది 'ఇన్‌సైడ్ అవుట్ 2'. జూన్ 14న విడుదలైన ఈ సీక్వెల్‌కు కెల్సీ మన్ దర్శకత్వం వహించారు. దాదాపు 96 నిమిషాల నిడివి కలిగిన ఈ సినిమాను ప్రముఖ హాలీవుడ్ నిర్మాణ సంస్థ వాల్ట్ డిస్నీ అనుబంధ సంస్థ పిక్సర్ నిర్మించింది. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. తన తోటి మిత్రులతో ఐస్ హాకీ ఆడే సమయంలో 13 ఏళ్ల రిలే అండర్సన్ జీవితంలోకి ఆందోళన, అసంతృప్తి, సిగ్గు, అసూయ ప్రవేశిస్తాయి. ఆ క్షణం నుంచి సినిమా ఎన్ని మలుపులు తీసుకుందనేది దర్శకుడు చాలా వినోదాత్మకంగా చూపించారు. టీనేజర్లను విపరీతంగా ఆకట్టుకునేలా తెరకెక్కిన ఈ చిత్రానికి ప్రస్తుతం కుటుంబ సమేతంగా ప్రేక్షకులు క్యూ కడుతున్నారు. ఇదే ఊపు కొనసాగితే ఈ సినిమా మరిన్ని రికార్డులు సాధించడం ఖాయమని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

హారర్ మిస్టరీ...



బెల్లంకొండ సాయిశ్రీనివాస్, అనుపమా పరమేశ్వరన్ జంటగా ఓ హారర్ మిస్టరీ సినిమాలో నటిస్తున్నారు. 'చావు కబురు చల్లగా' సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్న కౌశిక్ పెగళ్లపాటి దర్శకత్వం వహిస్తున్నారు. సాహు గారపాటి నిర్మిస్తున్నారు. సోమవారం ఈ సినిమాను ప్రారంభించారు. ఈ సినిమా ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత నవీన్ యెర్నేని క్లాప్ కొట్టగా, నిర్మాత దిల్‌రాజు కెమెరా స్విచ్ఛాన్ చేశారు. సతీశ్ కిలారు, అన్మోల్ శర్మ స్క్రిప్ట్ అందించారు. జూలై 11 నుంచి ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుందని, ఇప్పటివరకూ ఎవ్వరూ తీయని కథాంశంతో సినిమాను తెరకెక్కిస్తున్నట్లు చిత్ర బృందం తెలిపింది. ఈ చిత్రానికి ఎడిటర్: నిరంజన్ దేవరమానే, డీఓపీ: చిన్మయ్ సలార్కర్, సంగీతం: బి.అజనీశ్ లోక్‌నాథ్.

సునయన పెళ్లి అతనితోనేనా?




'కుమారి వర్సెస్ కుమారి' చిత్రంతో వెండితెర ప్రవేశం చేశారు సునయన. 'రాజరాజచోర' చిత్రంతో హిట్ అందుకుని ఆ తర్వాత కొన్ని సినిమాలు, 'మీట్ క్యూట్', 'ఇన్స్‌పెక్టర్ రిషి' వెబ్ సిరీస్‌లో నటించారు. కొన్ని రోజుల క్రితం తనకు నిశ్చితార్థం అయ్యిందని సోషల్ మీడియాలో ప్రకటించి.. తన కాబోయే భర్త వేలు పట్టుకున్న ఫొటోను షేర్ చేశారు. కానీ తను పెళ్లాడబోయే వ్యక్తి పేరు మాత్రం చెప్పకుండా అందరినీ సస్పెన్స్‌లో పెట్టారు. తాజాగా, ఆమె పెళ్లి చేసుకోబోయేది దుబాయ్‌కు చెందిన ఖలీద్ అల్ అమేరి అనే యూట్యూబర్‌ను అని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. దీనికి కారణం జూన్ 26న ఖలీద్ అల్ అమేరి తన ఇన్‌స్టా ఖాతాలో ఓ అమ్మాయితో ఉంగరాలు మార్చుకున్న ఫొటోను పోస్ట్ చేశారు. దీంతో సునయన నిశ్చితార్థం చేసుకున్న వ్యక్తి.. పెళ్లి చేసుకోబేయేది ఖలీల్‌నే అని అందరూ అనుకుంటున్నారు. కాగా, ఖలీల్‌కు ఇప్పటికే సలామా మొహమ్మద్‌తో పెళ్లయిందని, ఫిబ్రవరి 14న వారిద్దరూ విడాకులకు అప్లై చేయగా వెంటనే విడాకులు మంజూరు అయ్యాయట. ఈ విషయాన్ని స్వయంగా ఖలీల్ భార్య సలామానే చెప్పారు.



రామ్‌చరణ్ సొంత చిత్రంలో నిఖిల్

వి మెగా పిక్చర్స్ పతాకంపై చిత్రాలు నిర్మించడానికి హీరో రామ్‌చరణ్ నిర్మాణరంగంలోకి ప్రవేశించారు. యూవీ క్రియేషన్స్ విక్రమ్‌రెడ్డి ప్రొడక్షన్ పార్ట్‌నర్. అభిషేక్ పిక్చర్స్ అధినేత అభిషేక్ అగర్వాల్ వీరిద్దరితో చేతులు కలిపారు. నిఖిల్ హీరోగా నిర్మించే తొలి చిత్రం 'ది ఇండియా హౌస్' నిర్మాణానికి సోమవారం శ్రీకారం చుట్టారు. సాయి మంజ్రేకర్ హీరోయిన్‌గా నటించే ఈ చిత్రంలో అనుపమ్ ఖేర్ కీలక పాత్ర పోషించనున్నారు. 1905వ సంవత్సరం నేపథ్యంగా ప్రేమ, విప్లవం అంశాలతో రూపుదిద్దుకొనే ఈ చిత్రం షూటింగ్ హంపీలోని విరూపాక్ష దేవాలయంలో ప్రారంభమైంది. మంగళవారం నుంచి రెగ్యులర్ షూటింగ్ జరుగుతుంది. ఈ చిత్రానికి కెమరూన్ బ్రైసన్ ఛాయాగ్రాహకుడు.

ఐదుగురు స్నేహితుల వినోదం



ఎమ్మెస్ చదవడానికి విదేశాలకు వెళ్లిన ఐదుగురు చిన్ననాటి స్నేహితుల మధ్య జరిగే సంఘటనల ఆధారంగా రూపుదిద్దుకుంటున్న చిత్రం 'ది బర్త్‌డే బాయ్'. రవికృష్ణ, సమీర్ మళ్లా, రాజీవ్ కనకాల ముఖ్య పాత్రలు పోషించిన ఈ చిత్రాన్ని విస్కీ దర్శకత్వంలో బొమ్మా బొరుసా సంస్థ నిర్మిస్తోంది. ఈ చిత్రం టీజర్‌ను దర్శకుడు మెహర్ రమేశ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు విస్కీ మాట్లాడుతూ 'ఇదొక కామెడీ డ్రామా. చిత్రంలోని ప్రతి పాత్ర ఎంటర్‌టైన్ చేస్తుంది. ఐదుగురు స్నేహితులకు ఎదురైన అనుభవాలు, వాటి పర్యావసానాలు చాలా ఆసక్తికరంగా ఉంటాయి. ఈ నెల 19న సినిమాను విడుదల చేస్తాం' అని చెప్పారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/U7EeSaE లో చదవండి.



పురుగు మందుల దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, వ్యవసాయాధికారులు

పురుగు మందుల దుకాణాల్లో తనిఖీలు

● రూ.2,51,770 విలువైన 43లీటర్ల కలుపు మందుల సీజ్

తెనాలి రూరల్, జూలై 1: ఎరువులు, పురుగు మందులు అమ్మకాలు జరిపే దుకాణాల్లో సోమవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని గంగానమ్మపేటలో నంబూరి శ్రీకుమార్ ఏజెన్సీస్‌లో రెండు కంపెనీలకు సంబంధించిన కలుపు మందులు ప్రిన్సిపల్ సర్టిఫికెట్స్ అనుమతులు లేకుండా అమ్మకాలు జరపడాన్ని గుర్తించి సుమారు రూ.2,51,770 విలువ గలిగిన 43 లీటర్ల కలుపు మందులను సీజ్ చేశారు. ఈ సందర్భంగా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వ్యవసాయాధికారి కె.రమణకుమార్ మాట్లాడుతూ విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు విక్రయించే వ్యాపారుల తప్పనిసరిగా నిబంధనలు పాటించాలన్నారు. షాపు ముందు దుకాణంలో ఉన్న స్టాక్ వివరాలు వాటిని అమ్మకాలు జరిపే ధరల పట్టికలను తప్పని సరిగా ఏర్పాటు చేయాలన్నారు. అనుమతులు లేని ఉత్పత్తులను అమ్మకాలు జరపరాదని నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టప్రకారం చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఏడీఏ ఉషారాణి, ఏవో జి. ప్రేమసాగ్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

8న రాష్ట్ర స్థాయి నాటికల పోటీలు

తెనాలి అర్బన్, జూలై 1: ఈదర రామారావు చారిటబుల్ ట్రస్ట్, రోటరీ కళా పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 8, 9 తేదీల్లో రాష్ట్ర స్థాయి నాటికల పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు సోమవారం ట్రస్ట్ కార్యాలయంలో పోటీల కరపత్రాలను విడుదల చేశారు. రోటరీలో విశేష సేవలు అందించిన రోటేరియన్ అన్నే రత్నా ప్రభాకర్‌కు రోటరీ వ్యవస్థాపకులు పాల్‌హరీస్ అవార్డును ప్రదానం చేశారు. తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో నిర్వహించిన పోటీలను కళాభిమానులు జయప్రదం చేయాలని కోరారు. నిర్వాహకులు గుత్తా వెంకటరత్నం, ఈదర వెంకటపూర్ణచంద్, గుమ్మడి ప్రసాద్, ఊపేంద్ర, మురళీకృష్ణ, మాలకొండయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు సిబ్బందికి సన్మానం

తెనాలి అర్బన్, జూలై 1: టూ టౌన్ పనిచేస్తున్న ఎస్‌ఐలు వెంకటేశ్వర్లు, సుబ్బారావు, హోంగార్డు శివరామయ్య ఉద్యోగ విరమణ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని డీఎస్పీ రమేష్ శాలువా, జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో సీఐలు దశరథ రామయ్య సుధాకర్, రమేష్, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

ఘనంగా కుసుమ హరనాథ జయంతి

తెనాలి, మారీసుపేట జూలై 1: స్థానిక గాంధీనగర్‌లో కుసుమ హరనాథ మందిరంలో సోమవారం కుసుమ హరనాథుని 159 జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. భక్తులకు కన్నుల పండగగా వేదపండితులో కుసుమ హరనాథునికి అభిషేకాలు, అర్చనలు ప్రత్యేక పూజలను నిర్వహించారు. అత్తోట బజన బృందం వారు హరనాధుని సంకీర్తలను ఆలసించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో మందిర అధ్యక్ష, సెక్రటరీలు పీవీఎస్ నరశింహం, జయహరనాథ్, ముద్దాభక్తుని రమణయ్య, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

రోగుల పాలిట వైద్యులు ప్రాణదాతలు

● మాజీమంత్రి నన్నపనేని రాజకుమారి



డాక్టర్సడే సందర్భంగా సన్మానించిన వైద్యులతో మాజీమంత్రి రాజకుమారి, డాక్టర్లు శివరాంప్రసాద్, ప్రతాప్ తదితరులు

తెనాలి, మారీసుపేట జూలై 1: వైద్యులు రోగుల పాలిట ప్రాణదాతలని మాజీ మంత్రి నన్నపనేని రాజకుమారి కొనియాడారు. స్థానిక ఐతానగర్‌లోని జనఔషధి కేంద్రంలో సోమవారం పీఎంబీఐ ఆధ్వర్యంలో డాక్టర్సడేను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీమంత్రి నన్నపనేని రాజకుమారి అధ్యక్షతన, ముఖ్య అతిథిలుగా డాక్టర్లు నందిపాటి శివరాంప్రసాద్, పాటిబండ్ల వేణుగోపాల్, జిల్లా ప్రభుత్వ వైద్యశాల అధికారి సౌభాగ్యవాణిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజకుమారి మాట్లాడుతూ డాక్టర్లు ప్రాణదాతలని, ఈరోజు ప్రజలందరూ కరోనా లాంటి విపత్కర పరిస్థితులను దాటుకొని మనగలుగుతున్నారంటే దానికి డాక్టర్ల సేవలే కారణమన్నారు. అదేవిధంగా మన దేశ ప్రధాని పేద ప్రజలకు తక్కువ ధరలకే నాణ్యమైన మందులు లభించే విధంగా జనఔషధి కేంద్రాలు ఏర్పాటు చేశారని తెలిపారు. అనంతరం పలువురు డాక్టర్లను దుశ్శాలవాతో సత్కరించారు. కార్యక్రమంలో జనఔషధి రాష్ట్ర నోడల్ ఆఫీసర్ హరికృష్ణ, రాష్ట్ర బీజేపీ నాయకుడు పాటిబండ్ల రామకృష్ణ, డాక్టర్లు ఎం.సింగంరాజు, ఆవుల చక్రవర్తి, నన్నపనేని ప్రతాప్, గుమ్మడి సాంబశివరావు, అంచ లక్ష్మీతులసి, బీజేపీ నాయకులు కటారి వాసుదేవ నాయుడు, అనంతాచారి, సంపత్ రాయుడు, షైలా హరికృష్ణ, బిట్ర కనకదుర్గ, కళావతి తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ కన్నెగంటికి ఘన నివాళి

తెనాలి, మారీసుపేట, జూలై 1: స్థానిక బోసురోడ్డులోని ఐఎంఏ కార్యాలయంలో సోమవారం డాక్టర్ కన్నెగంటి వెంకట రామకృష్ణ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐఎంఏ అధ్యక్షురాలు డాక్టర్ జే విజయలక్ష్మి పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద ప్రజలకు ఆయన అందించిన వైద్యసేవలను మరువమన్నారు. డాక్టర్ కన్నెగంటి ఆదర్శప్రాయుడని అన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి డాక్టర్ పవని ప్రియాంక, డాక్టర్లు అనిల్‌కుమార్, జి.మధు ప్రభాకర్, గోగినేని ఉమ, లక్ష్మిప్రసాద్, చందు సాంబశివుడు, కె.శ్రీనివాసరావు, వి.శేషగిరిరావు, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇసుకను అందుబాటులోకి తేవాలి

సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ

పొన్నూరుటౌన్, జూలై 1: ఇసుకను తక్షణమే అందుబాటులోకి తేవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ కోరారు. సోమవారం పొన్నూరులో జరిగిన కార్యక్రమంలో లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఇసుక కొరతతో భవన నిర్మాణ రంగ కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక సీఐటీయూ కార్యదర్శి నిమ్మకూరి రమేష్‌బాబు, మిక్కిలి దుర్గయ్య, శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబం సంతోషంగా ఉండాలన్నదే ఆకాంక్ష

● పెన్షన్ల పంపిణీలో ఎమ్మెల్యే ధూళిపాళ్ళ



పెదకాకానిలో పెన్షన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

పెదకాకాని, జూలై 1: ప్రతి కుటుంబం సంతోషంగా ఉండాలన్నదే తమ ప్రభుత్వ ఆకాంక్ష అని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ సోమవారం పొన్నూరు ఎమ్మెల్యే దూళిపాళ్ల నరేంద్ర కుమార్ పెదకాకానిలో పెన్షన్‌దారుల గృహాలకు వెళ్లి అందచేశారు. పెదకాకాని రజక బజారులో జరిగిన సమావేశంలో అనేకమందికి పెన్షన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నరేంద్ర కుమార్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంవచ్చిన తర్వాత 2000నుంచి 3000 పెంచడానికి ఐదు సంవత్సరాలు పట్టిందన్నారు. ఎన్నికల సమయంలో ఇంటింటికి పెన్షన్ ఇచ్చే అవకాశం ఉన్నప్పటికీ, సిబ్బంది అందుబాటులో ఉన్నా బ్యాంకుల్లో వేసి లబ్ధిదారులను ఇబ్బంది పెట్టారని ఆరోపించారు. ప్రతిపక్షాలపై నెపం వేసి రాజకీయ లబ్ధి పొందటానికి వైసీపీ ప్రభుత్వం ప్రయత్నించింది అన్నారు. వారు చేసిన కుట్రలను గ్రహించి ప్రజలు వారికి 11 సీట్లు మాత్రమే ఇచ్చారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు మార్కండేయ బాబు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● పెదకాకాని, జూలై 1: మండలంలోని వెనిగండ్లలో గ్రామ పార్టీ అధ్యక్షుడు కొండమడుగు తిరుమలరెడ్డి, నంబూరులో పార్టీ అధ్యక్షుడు మాకురెడ్డి జయరామిరెడ్డి, అగతవరపాడులో టీడీపీ నాయకులు తాళ్ల శ్రీనివాసరావు, పెదకాకానిలో పార్టీ అధ్యక్షుడు కుక్కల మల్లికార్జునరావు, కొప్పురావూరులో ఉపసర్పంచ్ వినకోట పూర్ణశంకర్రావు, తక్కెళ్లపాడులో పార్టీ అధ్యక్షుడు ఆలపాటి సంపత్, రామచంద్రపాలెంలో పార్టీ అధ్యక్షుడు గోగినేని అమరేంద్ర, ఉప్పలపాడులో పార్టీ అధ్యక్షుడు షైలసుబ్బారావు, కృష్ణాపురంలో కుర్ర శ్రీనివాసరావు, తంగెళ్లమూడిలో దినేష్, అనుమర్లపూడిలో ప్రసాద్ తదితరులు పించన్ల పంపిణీని పర్యవేక్షించారు.

పొన్నూరు పట్టణంలో...

పొన్నూరు టౌన్, జూలై 1: ఎన్నికల వాగ్దానాలు అమలుచేసే కార్యక్రమంలో భాగంగా ఎన్టీఆర్ భరోసా పించన్లను పెంచి ఇస్తూ రాష్ట్రంలో సంక్షేమ పాలనకు నాంది పలికామని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. సోమవారం ఎన్టీఆర్ భరోసా పించన్ల పంపిణీ కార్యక్రమం పొన్నూరు పట్టణ, మండలంలో ఎన్డీఏ కూటమి నేతల సమక్షంలో అట్టహాసంగా ప్రారంభమైంది. మండల పరిధిలోని చింతలపూడిలో ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ పించన్ల పంపిణి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం పట్టణంలోని 8వ వార్డు, క్యాబిన్‌పేట, షరాఫ్ బజార్‌లోని చాందిని చౌక్ సెంటర్‌లో, మండల పరిధిలోని వెల్లలూరు గ్రామంలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమం ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభమైంది. కార్యక్రమంలో జనసేన సమన్వయ కర్త వడ్రాణం మార్కండేయ బాబు, బీజేపి జిల్లా కార్యదర్శి కలపాల శ్రీనివాసరావు, కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

● చేబ్రోలు, జూలై 1: మండలంలోని ఉప్పరపాలెంలో సోమవారం ఎన్టీఆర్ భరోసా పించన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ గ్రామంలో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పెంచిన పెన్షన్ల నగదును లబ్ధిదారులకు అందచేశారు. మండల పరిధిలోని గొడవర్రులో సర్పంచ్ బీరం జానకీదేవి ఆధ్వర్యంలో సోమవారం ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ల పంపిణీ జరిగింది.

● చేబ్రోలు, జూలై 1: ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణి సోమవారం ప్రారంభం కాగా ఒక రోజులోనే పెన్షన్ల పంపిణీ పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెటుకున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు ఇటింటికి వెళ్లి పెన్షన్ల పంపిణీ పూర్తి చేసారు. చేబ్రోలు మండలం వడ్లమూడి డీవీసీ హాస్పటల్‌లో చికిత్సపొందుతున్న కారుమూరి మరియమ్మ అనే మహిళకు పింఛను పంపిణీ పర్యవేక్షకురాలు ఏఎన్ఎం సుజాత, ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ చేతుల మీదుగా పింఛను అందచేశారు.

ఎన్టీఆర్ భరోసా పింఛన్లతో లబ్ధిదారుల కళ్లల్లో ఆనందం

● మంత్రి నాదెండ్ల మనోహర్

తెనాలి రూరల్, జూలై 1: చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు ఎన్నికల సమయంలో చేసిన వాగ్దానంను నెరవేరుస్తూ ఎన్టీఆర్ భరోసా పింఛన్లతో లబ్ధిదారుల కళ్లల్లో ఆనందం వెల్లివిరుస్తోందని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. సోమవారం మండలంలోని కఠెవరం, తెనాలి పట్టణంలోని 7వ, 18వ వార్డులలో మంత్రి మనోహర్ పర్యటించి లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ వృద్ధాప్యంలో ఉన్న అవ్వతాతలకు, ఒంటరి మహిళలకు, దివ్యాంగులకు, అనారోగ్య సమస్యలతో మంచంపట్టిన వారికి ప్రభుత్వం భరోసాగా నిలవాలని పింఛన్లను పెంచి అందించడం జరిగిందన్నారు. పలువురు కూటమి నాయకులు, పార్టీల శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

పండుగ వాతావరణంలో పింఛన్ల పంపిణీ



కొల్లిపర మండలం అత్తోటలో పెన్షన్‌లను పంపిణీ చేస్తున్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్

తెనాలి, మారీసుపేట జూలై 1: నవ్యాంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడి సీఎంగా చంద్రబాబు నాయుడు మూడవ సంతకంతో అవ్వ తాతలకు, దివ్యాంగులకు పెంచిన పింఛన్లను పండుగ వాతావరణంలో ఉదయం గం.6 లకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు సచివాలయ అధికారులతో కలసి పంపిణీ చేశారు. స్థానిక నందులపేటలోని 4వ వార్డులో టీడీపీ పట్టణాధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్, వార్డు కౌన్సిలర్ అడుసుమల్లి వెంకటేశ్వరావుల ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది అర్హులైన లబ్ధిదారులకు మొత్తం రూ. 7000లను పంపిణీ చేశారు. బోసురోడ్డు 7వ వార్డులో టీడీపీ నాయకులు చాట్రగడ్డ అంజనేయులు, న్యాయవాది కోగంటి శంకరావు, పాలకొల్లు సోమశేఖరావుల ఆధ్వర్యంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్‌లను అర్హులైన లబ్ధిదారులకు అందజేశారు. పట్టణంలో 12వ వార్డులో టీడీపీ పార్టీ రాష్ట్ర ఐటీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి మల్లవరపు విజకుమార్, పట్టణాధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్‌లను వార్డు నాయకుడు కార్యకర్తలతో కలసి పంపిణీ చేశారు. అనంతరం చంద్రబాబు, మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో బి ప్రసాద్, దుర్గాబాయి, కె లక్ష్మణ్, వెంకట్రావ్, రామునాయక్ తదితరులు పాల్గొన్నారు.

● తెనాలి, మారీసుపేట: స్థానిక ఐతానగర్‌లోని ఒకటి, రెండో వార్డులలో సోమవారం పింఛన్లను టీడీపీపార్టీ రాష్ట్ర వాణిజ్య అధికార ప్రతినిధి ఈదర పూర్ణచంద్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో రైతు నాయకుడు ఈదర పూర్ణచంద్, కాకుమాను సత్యనారాయణ, కన్నెగంటి వెంకటేశ్వరావు, యోహన్, రమేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● తెనాలి రూరల్: మండలంలోని గుడివాడలో సోమవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను గ్రామ సర్పంచ్ యడ్లపాటి రాకేష్, గ్రామ పార్టీ నాయకులతో కలిసి ఇంటింటి వెళ్లి లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

ఎన్టీఆర్ భరోసాతో అవ్వాతాతల కళ్లల్లో ఆనందం: ఆలపాటి

తెనాలి రూరల్, జూలై 1: ఎన్టీఆర్ భరోసా పింఛన్లతో లబ్ధిదారుల కళ్లల్లో ఆనందం చూశామని గత జగన్ ప్రభుత్వం మాదిరి మాట ఇచ్చి మడం తిప్పే సంస్కృతి మాదికాదని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. సోమవారం పెంచిన పింఛన్ల సొమ్ము ఎన్టీఆర్ భరోసా పథకాన్ని మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మండలంలోని కొలకలూరులో ప్రారంభించారు. తొలుత మండలంలోని కొలకలూరులో మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పార్టీ శ్రేణులతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

● తెనాలి రూరల్, జూలై 1: వృద్ధాప్యంలో ఉన్న అవ్వాతాతలకు, మరొకరి సాయం అవసరమైన దివ్యాంగులకు, అనారోగ్యంతో మంచంపట్టిన వారికి ఆసరగా నిలవాలని ఎన్టీఆర్ భరోసా పింఛన్ పేరుతో పెద్ద మొత్తంగా పెంచి గొప్ప మనసున్న నాయకులుగా సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లు ప్రజల మనస్సులో చిరస్థాయిగా నిలిచిపోయారని గణేష్‌యూత్ కన్వీనర్, టీడీపీ సీనియర్ నాయకులు వీరవల్లి మురళి చెప్పారు. సోమవారం ఆయన కనగాల నాగభూషణం పార్టీ శ్రేణులతో కలిసి పట్టణంలోని 29వ వార్డులో పింఛన్లు పంపిణీ చేశారు. కూటమి శ్రేణులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. మండలంలోని అంగలకుదురులో గ్రామ పార్టీ అధ్యక్షుడు కనగాల శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ ఊసరపు రాజ్యలక్ష్మి, ఉపసర్పంచ్ కనగాల నాగభూషణం, మాజీ ఎంపీపీ సూర్యదేవర వెంకట్రావు, సీనియర్ పార్టీ నాయకులు వీరవల్లి మురళి, హెచ్‌సీవీ అధినేత సీనియర్ టీడీపీ నాయకులు కరణం వెంకటేశ్వరరావు పలువురు గ్రామ పార్టీ నాయకులతో కలిసి లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛన్లను పంపిణీ చేశారు. మండలంలోని కొలకలూరు, నందివెలుగు, బుర్రిపాలెం, పెదరావూరు, వంటి పలు గ్రామాల్లో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. పట్టణంలోని 35వ వార్డులో జనసేన, టీడీపీ పార్టీ నాయకులు పింఛన్లను పంపిణీ చేశారు.

● కొల్లిపర, జూలై 1: మండల పరిధిలోని అత్తోట, కొల్లిపర, తూములూరు గ్రామాల్లో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో కలిసి ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ తెలుగురైతు రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి వంగా సాంబిరెడ్డి, టీడీపీ జిల్లా కార్యదర్శి కంచర్ల అమృతరాజు, టీడీపీ, జనసేన నాయకులు గుదిబండి గోవర్ధనరెడ్డి, యర్రు వెంకయ్యనాయుడు, భీమవరపు లంకకోటిరెడ్డి, కొఠారు అంజనేయులు, భీమవరపు కిశోర్‌రెడ్డి, దాసరి నరసయ్య, బొద్దులూరి సాంబశివరావు, వరికూటి నాగరాజు, బొమ్ము వెంకట్రామిరెడ్డి, కొల్లి కోటిరెడ్డి, చాగంటి నారాయణరెడ్డి, ఏమినేని శివపార్వతీ, షేక్ రఫీ, సాల్మన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



అంగలకుదురులో పింఛన్లు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు



డాక్టర్ సీఎస్‌ఆర్‌కే ప్రసాద్ బంగారు పతకాన్ని డాక్టర్ సాయి పవన్‌కు ప్రదానం చేస్తున్న ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు

డాక్టర్ సాయి పవన్‌కు బంగారు పతకం ప్రదానం

తెనాలి మారీసుపేట, జూలై 1: తెనాలి ఐఎంఏ ఆధ్వర్యంలో డాక్టర్ సీఎస్‌ఆర్‌కే ప్రసాద్ బంగారు పతకాన్ని డాక్టర్ సాయి పవన్‌కు సోమవారం ప్రదానం చేశారు. పట్టణంలోని బోస్‌రోడ్డులో గల ఐఎంఏ (ఇండియన్ మెడికల్ అసోసియేషన్) హాల్లో ఆదునిక వైద్య విధానంలో గుండె ఆపరేషన్ అనే అంశంపై డాక్టర్ ఎ. సాయిపవన్ ఉపన్యాసం చేశారు. అనంతరం అదే సభలో డాక్టర్స్ డే ను పురస్కరించుకుని తెనాలి జిల్లా ప్రభుత్వవైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి, డాక్టర్ రామలక్ష్మి, డాక్టర్ జీవనలతలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో డాక్టర్ ఎ. సాయి పవన్ మాట్లాడుతూ గుండె ఆపరేషన్ అంటే చాలా మంది భయపడతారని, పెరిగిన సాంకేతిక పరిజ్ఞానంతో పాటు వైద్య విధానంలో కూడా గుండె ఆపరేషన్‌కు ఆధునిక వైద్య విధానంలో సులభంగా చేసే వైద్య విధానాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. గుండెకు సంబంధించిన జబ్బులు, వాటిని సకాలంలో గుర్తించే విధానంపై ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌తో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షురాలు డాక్టర్ విజయలక్ష్మి, కార్యదర్శి డాక్టర్ పావని, ఉపాధ్యక్షులు డాక్టర్ అనీల్‌కుమార్, సహాయ కార్యదర్శి డాక్టర్ మదు ప్రభాకర్, డాక్టర్ శ్యాం ప్రసాద్, డాక్టర్ దక్షిణామూర్తి, డాక్టర్ సీఎస్‌ఆర్‌కె ప్రసాద్, డాక్టర్ బీహెచ్ సాంబిరెడ్డి, డాక్టర్ మస్తానమ్మ, డాక్టర్ ఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

నూతన చట్టాలపై ఆటోవర్కర్ల నిరసన

తెనాలి అర్బన్, జూలై 1: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన చట్టాలపై ట్రాన్స్‌పోర్టు వర్కర్లు నిరసన తెలిపారు. ఆటోవర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం నిరసన ప్రదర్శన చేశారు. సీఐటీయూ జిల్లా నాయకులు కొల్లిపర బాబుప్రసాద్ మాట్లాడుతూ, జీవనోపాధికి ఈ చట్టాలు విఘాతం కలిగించేలా ఉన్నాయని, ప్రభుత్వ విధానాల కారణంగా ఇప్పటికే రవాణారంగం కుదేలైందన్నారు. వైసీపీ ప్రభుత్వం కారణంగా రోడ్లు అధ్వానంగా తయారయ్యాయని, పెట్రోల్, డీజిల్, స్పేర్ పార్ట్స్ ధరలు పెరిగి రవాణా రంగం దారుణంగా తయారైందన్నారు. ఈ చట్టాలను అమలు చేయకుండా ప్రజా ప్రతినిధులు ఒత్తిడి తేవాలని కోరారు. సాంబశివరావు, దుర్గా ప్రసాద్, షబ్బీర్, సంజయ్, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

ఏవీ సుబ్బారావుకు రంగస్థల పురస్కారం

తెనాలి అర్బన్, జూలై 1: గాన కోకిల ఏవీ సుబ్బారావు స్మారక రంగస్థల పురస్కారాల ప్రదానం సోమవారం తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో నిర్వహించారు. రంగస్థల సంగీత దర్శకుడు చింతలపూడి చెంచయ్యకు ఏవీ సుబ్బారావు రంగస్థల పురస్కారంతో సత్కరించారు. ఈ సందర్భంగా పాండవోద్యోగం, రామాంజనేయ యుద్ధం, గయోపాఖ్యానం, చింతామణి నాటకాల్లో సన్నివేశాలు ప్రదర్శించారు. ప్రారంభ సభలో సాహిత్యవేత్త మన్నే శ్రీనివాసరావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా సుబ్బారావు కుటుంబం రంగస్థలానికి సేవలందిస్తున్నారని చెప్పారు. ఆరాధ్యుల ఆదినారాయణ, వెంకటేశ్వరరావు, నాగరాజు, కళాకారులు బాలాజీ, జీవన్‌కుమార్, వనజ, రామ్‌దాసు, రత్నశ్రీ తదితరులు ప్రసంగించారు. జయప్రకాష్ చౌక్‌లోని సుబ్బారావు విగ్రహానికి ఆయన 94వ జయంతిని పురస్కరించుకని పూలమాలలు వేసి నివాళులర్పించారు.

డెంగీపై అప్రమత్తంగా ఉండాలి: ప్రభాకరరెడ్డి

తెనాలి, మారీసుపేట జూలై 1: పట్టణ ప్రజలు డెంగీపై అప్రమత్తంగా ఉండాలని పట్టణ సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకరరెడ్డి అన్నారు. స్థానిక చినరావూరులో సోమవారం పట్టణ మలేరియా, ఫైలేరియా అధికారులు డెంగీ వ్యతిరేక మాసోత్సవ అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డెంగీపై తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. మలేరియా, ఫైలేరియా సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎన్‌యూ వీసీ ప్రొఫెసర్ రాజశేఖర్ రాజీనామా

పెదకాకాని, జూలై 1: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పట్టేటి రాజశేఖర్ సోమవారం తన పదవికి రాజీనామా చేసి ఆ లేఖను ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సంధ్య కోలేకు అందజేశారు. వైస్ చాన్సలర్ తన విధులకు సహకారం అందించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు. విశ్వవిద్యాలయానికి ఏ ప్లస్ గ్రేడ్ తెచ్చేందుకు ప్రతి ఒక్కరి సహకారం ఉందని అకడమిక్‌గా విశ్వవిద్యాలయం మరో మెట్టుకు ఎదిగేలా చేయాలన్నారు. విశ్వవిద్యాలయానికి సెంట్రల్ యూనివర్సిటీ స్థాయిని కల్పిస్తే విస్తృత అభివృద్ధి సాధ్యమవుతుందని, రాజధానిలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయానికి ప్రత్యేకత ఉంటుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అనంతరం ఆయన తన చాంబర్ నుంచి ఇంగ్లీష్ విభాగానికి వెళ్లారు.

రెక్టర్ రాజీనామా.......

ఏఎన్యూ రెక్టార్ ప్రొఫెసర్ పి. వరప్రసాద్‌మూర్తి తన పదవికి రాజీనామా చేస్తూ రాజీనామా లేఖను ఇన్చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సంధ్య కోలేకు అందజేశారు. సోమవారం సాయంత్రం ఆయన తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఇన్చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సంధ్య కోలే మాట్లాడుతూ గౌరవ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పి.రాజశేఖర్, రెక్టర్ ప్రొఫెసర్ పి వరప్రసాద్ మూర్తి రాజీనామా లేఖలను ఉన్నత విద్య శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ పంపినట్లు పేర్కొన్నారు.

పదవుల నుంచి రిలీవ్ కోరిన అధికారులు....

విశ్వవిద్యాలయంలో పాలనాపరమైన పదవులు నుంచి తమను రిలీవ్ చేయాలని కోరుతూ వర్శిటీలోని డైరెక్టర్లు, కోఆర్డినేటర్‌లు మూకుమ్మడిగా తమ రిలీవింగ్ ఆర్డర్లను సోమవారం ఉదయం వైస్ ఛాన్సులర్ ప్రొఫెసర్ పి. రాజశేఖర్ కు అందజేశారు. రిలీవింగ్ కోరిన వారిలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.కరుణ, దూరవిద్య కేంద్రం డైరెక్టర్ డాక్టర్ బట్టు నాగరాజు , సిడిసిడిన్ ప్రొఫెసర్ కె.మధుబాబు, పీజీ పరీక్షల కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఉదయ్‌కుమార్, ఇంటర్నేషనల్ స్టూడెంట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ చెన్నారెడ్డి, దూర విద్యా కేంద్రం పరీక్షల కోఆర్డినేటర్ డాక్టర్ సోమశేఖర్, పే రోల్ కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ బి.సత్య నారాయణ, బాలుర వసతిగృహాల చీఫ్ వార్డెన్ ప్రొఫెసర్ జి.నాగరాజులు తమను రిలీవ్ చేయాలని కోరారు. వారి విన్నపాలను ఇన్చార్జి రిజిస్టర్ ప్రొఫెసర్ సంధ్యకోలేకు పంపినట్లు వీసీ ప్రొఫెసర్ రాజశేఖర్ తెలియజేశారు.

వీసీ రాజశేఖర్ రాజీనామాపై ఉద్యోగ, విద్యార్థి సంఘాల హర్షం

పెదకాకాని, జూన్ 1: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వీసీ పదవికి రాజశేఖర్ రాజీనామా చేసిన సందర్భంగా టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు నితీష్ యాదవ్ ఆధ్వర్యంలో హర్షం వ్యక్తం చేశారు. సోమవారం మెయిన్ గేట్ వద్ద ఆచార్య నాగార్జునుడి విగ్రహానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేసి టపాకాయలు కాల్చి, స్వీట్స్ పంచారు. కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు నితీష్‌యాదవ్, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు భాగ్యరాజు, శ్రీను, సుమంత్, గణేష్, రాజశేఖర్, యశ్వంత్, స్కాలర్స్ శశి, సునీల్, టీచింగ్, నాన్ టీచింగ్ ఎంప్లాయిస్, విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు.



డాక్టర్ సాయిబాబును సత్కరిస్తున్న లయన్స్ స్వర్ణపురి మహిళా సభ్యులు

వైద్యులను గౌరవించటం మన సంప్రదాయం

పొన్నూరు టౌన్, జూలై 1: ప్రాణాలు కాపాడే వైద్యులను గౌరవించటం భారతీయ సంప్రదాయం అని లయిన్స్ క్లబ్ ఆఫ్ పొన్నూరు స్వర్ణపురి మహిళా అధ్యక్షురాలు మన్నవ అనసూయదేవి అన్నారు. సోమవారం అంతర్జాతీయ డాక్టర్స్ డే వేడుకలు పట్టణంలో స్వర్ణపురి మహిళా క్లబ్ ఆధ్వర్యంలో జరిగాయి. పట్టణంలోని ప్రముఖ వైద్యులు డాక్టర్ మన్నె సాయిబాబు, డాక్టర్ ఏ కోటిరెడ్డిలను లయన్స్ క్లబ్ ఆఫ్ పొన్నూరు, స్వర్ణపురి సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పి.శేషకుమారి, బి.శబలాదేవి, జి.కృష్ణకుమారి, పరాశరం రంగవల్లి, నాగమంజరి, ఉమాకుమారి తదితరులు పాల్గొన్నారు.



పాఠశాల నిర్వాహకులకు నగదు అందచేస్తున్న ప్రధానోపాధ్యాయుడు ఏడుకొండలు

స్కాలర్‌షిప్పుల కోసం రూ.25 వేలు విరాళం

చేబ్రోలు, జూలై 1: పాఠశాల్లో ఉత్తమ పలితాలు సాధించిన విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు ప్రతిభ పురస్కారాలు అందించేందుకు రూ.25వేలు విరాళంగా నారాకోడూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌కు అందింది. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం ఏడుకొండలు అయన తండ్రి శివరామయ్య కృష్ణ జ్ఞాపకార్థం రూ.25వేలు ఫిక్సిడ్ డిపాజిట్‌గా అందించారు. ఈ డిపాజిట్‌పై వచ్చే వడ్డీని ప్రతి ఏటా మెరిట్ విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతిగా, ఉపకార వేతనాలుగా అందించనున్నారు. మండల విద్యాశాఖ అధికారి రాయల సుబ్బారావు చేతుల మీదుగా ఈ నగదును పాఠశాలకు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం వెంకటేశ్వర్లు, ఏ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ తరలిస్తున్న వాహనం స్వాధీనం

పొన్నూరు టౌన్, జూలై 1: పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా రేషన్ బియ్యంను తరలిస్తున్న వాహనాన్ని ఆదివారం అర్ధరాత్రి అర్బన్ పోలీసులు స్వాధీనం చేసుకుని విచారణ నిర్వహిస్తున్నారు. పోలీసుల కథనం ప్రకారం పట్టణంలోని ఇటికంపాడు రోడ్డు 26వ వార్డులో అనుమతి లేకుండా రేషన్ దుకాణం నుంచి వేరే ప్రాంతానికి చెందిన ఎండీయూ ఆపరేటర్ వాహనంలోకి రేషన్ బియ్యం నింపుకుంటుండగా స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అర్బన్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకోవటంతో కూలీలు, సంఘటన స్థలం నుంచి పరారయ్యారు. రేషన్ బియ్యం వివరాలు కోరటంతో పొంతనలేని సమాధానాలు ఇవ్వటంతో పోలీసులు రేషన్ వాహనాన్ని అర్బన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి సివిల్స్ సప్లయ్స్ డిప్యూటీ తహసీల్దార్ భువనేశ్వరికి సమాచారం ఇచ్చారు. సోమవారం డీటీ భువనేశ్వరి రేషన్ బియ్యం వివరాలపై దర్యాప్తు ప్రారంభించారు. దీనిపై డీటీ భువనేశ్వరిని వివరణ కోరగా పూర్తిస్థాయి విచారణ జరిపి డీలర్, వాహనదారునిపై చర్యలు తీసుకుంటామన్నారు.

రేపు ఏఎన్‌యూ ఐసెట్ పరీక్ష

పెదకాకాని, జూలై 1: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సెల్ఫ్ సపోర్టు కేటగిరీలో భర్తీ చేయనున్న ఎంబీఏ కోర్సులకు ఈ నెల 3వ తేదీన అర్హత పరీక్ష నిర్వహిస్తున్నట్లు అడ్మిషన్ల డైరెక్టర్ జి.అనిత సోమవారం తెలిపారు. మధ్యాహ్నం 2గంటల నుంచి 4.30 వరకు వర్సిటీలోని జర్నలిజం విభాగంలో ఈ పరీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పరీక్షకు దరఖాస్తు చేసిన వారు హాజరుకావాలని అనివార్య కారణాలవల్ల దరఖాస్తు చేయలేని వారు కూడా వచ్చి దరఖాస్తు చేసుకుని పరీక్ష రాసే అవకాశాన్ని కల్పించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ విషయాన్ని విద్యార్థులు పరిగణలోకి తీసుకోవాలని డాక్టర్ అనిత సూచించారు. ఈ పరీక్ష ద్వారా విశ్వవిద్యాలయంలో ఎంబీఏ జనరల్, ఎంబీఏ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్, ఎంబీఏ టూరిజం ట్రావెల్ మేనేజ్మెంట్, ఎంబీఏ ఇంటర్నేషనల్ బిజినెస్ స్టడీస్, ఎంబీఏ మీడియా మేనేజ్మెంట్, ఎంబీఏ టెక్నాలజీ మేనేజ్మెంట్, ఎంసీఏ కోర్సులలో ప్రవేశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

తెనాలి అర్బన్, జూలై 1: బీసీ కాలనీలోని వేజండ్ల సుబ్బారావు స్మారక పాఠశాలలో విద్యా ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు పుస్తకాలు, కలర్ పెన్సిల్స్, పెన్నులు, తల్లిదండ్రులకు గుడ్డ సంచులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు వేజండ్ల ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ బజారుకు వెళ్లేటప్పుడు చేతిసంచి తీసుకువెళ్లాలన్నారు. కార్యక్రమంలో వేజండ్ల నవ్య, బి.శివరామకృష్ణ, ప్రసాద్, శ్రీదేవి, బసవేశ్వరరావు పాల్గొన్నారు.